


# విజయభాను





విశాఖపట్నం, శనివారం 28-12-2019 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 95 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## 'పచ్చ' కుంభకోణంపై
# విచారణ జరిపిస్తాం

- నిపుణుల సలహా మేరకే నిర్ణయాలు
- పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు
- అమరావతి భూకుంభకోణంపై సీబీఐ, సీఐడీ లేదా లోకయుక్త విచారణ!
- హైపవర్ కమిటీ సమీక్ష అనంతరం రాజధానిపై ప్రకటన
- ఏపీ మంత్రిమండలి కీలక నిర్ణయాలు
- కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పేర్నినాని



అమరావతి : రాజధాని ప్రకటనకు ముందు చంద్రబాబుకు వాటాలు ఉన్న కంపెనీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు కొనుగోలు చేసిన భూములపై న్యాయ నిపుణుల సలహా తీసుకుని విచారణ జరిపిస్తామని మంత్రి పేర్ని నాని తెలిపారు. లోకయుక్త, సీబీఐ లేదా సీఐడీతో విచారణ జరిపించేలా నిర్ణయం ఉంటుందని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి, రాజధాని నిర్మాణం, జీఎన్‌రావు కమిటీ నివేదికపై చర్చ వంటి అంశాలపై శుక్రవారం సమావేశమైన మంత్రిమండలి నిర్ణయాలకు మంత్రి పేర్ని నాని మీడియా సమావేశంలో వెల్లడించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ఎస్టీలకు 4 శాతం, ఎస్సీలకు 19.08, బీసీలకు 38 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఏపీ పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం ఈ మేరకు తీర్మానం చేశామని పేర్కొన్నారు.

**హైపవర్ కమిటీ సమీక్ష అనంతరం తుది నిర్ణయం**

అలాగే రాజధానిపై జీఎన్‌రావు కమిటీ సమర్పించిన నివేదికపై కేబినెట్ చర్చించిందని, బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) రిపోర్టు ఇంకా రావాల్సి ఉందని తెలిపారు. ప్రజాసంక్షేమాన్ని పక్కనపెట్టి రాజధాని నిర్మాణం జరపాలా? లేక ప్రజలకు మెరుగైన వైద్యం, విద్య, మౌలిక సదుపాయాలు కల్పించాలా అనేదానిపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. జీఎన్‌రావు కమిటీతో పాటు శివరామకృష్ణ కమిటీ నివేదికను కూడా మంత్రిమండలి అధ్యయనం

తరువాయి 2లో..

## రైతులారా
# ఆందోళన వద్దు

- జీఎన్ రావు కమిటీ నివేదికపై సూత్రప్రాయ చర్చ
- బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ నిర్ణయం మేరకే రాజధానిపై నిర్ణయం
- ముగిసిన కేబినెట్ సమావేశం



అమరావతి : ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం ముగిసింది. దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం కొనసాగింది. అభివృద్ధి వికేంద్రీకరణపై జీఎన్ రావు కమిటీ అందజేసిన నివేదిక లోని సూచలనపై కేబినెట్ సమావేశంలో సూత్రప్రాయంగా చర్చ జరిగింది. ఇదే విషయాన్ని మంత్రి కురసాల కన్నబాబు కూడా ధ్రువీకరించారు. అయితే, రాజధాని విషయంలో మరో అధ్యయన కమిటీ నివేదిక రావాల్సి ఉందని గుర్తుచేశారు. బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) నివేదిక గురించి అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చారని.. జీఎన్ రావు కమిటీ నివేదిక, బీసీజీ నివేదికలు రెండింటినీ క్రోడీకరించి అభివృద్ధి వికేంద్రీకరణకు సంబంధించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

**చంద్రబాబు అవినీతిపై నివేదిక..**

కేబినెట్ భేటీకి ముందు మంత్రివర్గ ఉపసంఘం సీఎం వైఎస్ జగన్‌తో భేటీ అయింది. చంద్రబాబు పాలనలో అవినీతిపై మంత్రివర్గ ఉపసంఘం సీఎం వైఎస్ జగన్‌కు నివేదిక అందజేసింది. ఏసీబీ, విజిలెన్స్, నిపుణుల సహకారంతో మంత్రివర్గ ఉపసంఘం ఈ నివేదిక సిద్ధం చేసింది. చంద్రబాబు పాలనలో సాగునీటి ప్రాజెక్టులు, రాజధాని పనులు, ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతిపై నివేదిక సమర్పించడం జరిగింది.

## అమరావతి ప్రాంత రైతులకు
# అన్ని విధాలా న్యాయం చేస్తారు



విజయవాడ: టీడీపీ నాయకులు తమ రాజకీయ భవిష్యత్ కోసం అమరావతి ప్రాంత రైతులను పావులుగా వాడుకుంటున్నారని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆరోపించారు. అమరావతి రాజధానికి అనువైన ప్రాంతం కానప్పటికీ తాము పట్టుకున్న కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా టీడీపీ నాయకులు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న వాసిరెడ్డి పద్మ టీడీపీ

తరువాయి 2లో..

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎన్. రమేష్ కుమార్
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు



వార్త 2వ పేజీలో..

# విశాఖ ఉత్సవాలకు హాజరు కానున్న సీఎం జగన్



విశాఖపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నగర పర్యటనకు రానున్నారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేపట్టనున్న రూ.1,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. సీఎం విజయవాడ నుంచి మధ్యాహ్నం 3.10 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3.50 గంటలకు కైలాసగిరి మీదకు చేరుకుని వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేపట్టే అవకాశముంది. ఆర్థిక సమస్యలున్న దృష్ట్యా ప్రస్తుతా నికి రెడీమేడ్ సిటీ విశాఖయే మంచి ఆప్షన్. మరింత అభివృద్ధి చేస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అద్భుత మైన రాజధాని అవుతుందని వ్యాఖ్యానించారు.







# విస్తరణకు మంచి అవకాశమున్న విశాఖే బెస్ట్: టి. సుబ్బరామిరెడ్డి



విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్‌కు ఎగ్జిక్యూటివ్ రాజధానిగా విశాఖపట్టణాన్ని ఎంచుకోవడంపై రాజ్యసభ సభ్యులు టి. సుబ్బిరామిరెడ్డి స్పందించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన జీఎన్ రావు కమిటీ నివేదిక ప్రభుత్వానికి అందించిందన్న సమాచారం మీడియా ద్వారా తెలుసుకున్నా. విశాఖ ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ కావడం ఉపయోగకరంగా ఉంటుందని నా అభిప్రాయం. విభజనకు ముందు హైద్రాబాద్ తర్వాత పెద్ద సిటీ విశాఖే. నగరంలో మౌలిక సదుపాయాలతో పాటు విస్తారమైన భూములున్నాయి. పరిశ్రమలున్నాయి. పారిశ్రామికవేత్తలకు పరిచయమైన ప్రాంతం కావడంతో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ అయితే మరింత మంది పారిశ్రామిక వేత్తలు వస్తారు.



# ప్రజలందరికి సుపరి పరిపాలన అందించడమే జగనన్న లక్ష్యం

**భోగాపురంలో వైసీపీ విజయోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ**

చోడవరం : రాష్ట్ర ప్రజలందరికీ సుపరిపాలన అందించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రధాన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని సి.భోగాపురం గ్రామంలో వై.సి.పి విజయోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి ఎం.పి. భీశెట్టి వెంటకట సత్యవతి, కాంద్రేగుల విష్ణుమూర్తి దంపతులతో పాటు విశాఖ డెయిరీ సి.ఈ.వో, ఆడారి ఆనందకుమార్,డెయిరీ డెరెక్టర్లు దాడి గంగరాజు, గేదెల సత్యనారాయణ, షుగర్ ఫ్యాక్టరీ మాజీ ఛైర్మన్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఎం.పీ సత్యవతి మాట్లాడుతూ ప్రజలు నా పై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయనన్నారు. అనంతరం విశాఖ డెయిరీ సిఈవో, వై.సిపీ నాయకులు ఆడారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పల్లెలో అభివృద్ధికి తన వంతు సహకారాలు అందిస్తానన్నారు. అభివృద్ధి, సంక్షేమం, ఉపాధికి ప్రాధాన్యమిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే ధర్మశ్రీ, డెయిరీ సి.ఈ.వో ఆనంద్ కుమార్‌ను స్థానిక నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వై.సి.పి జిల్లా కార్యదర్శి ఏడువాక సత్యారావు, మండల పార్టీ అధ్యక్షులు పల్లా నరసింగరావు, బొడ్డేడ సూర్యనారాయణ, సూరిశెట్టి నాగదుర్గ గోవింద,స్థానిక వై.సి.పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ధర్మశ్రీని, డెయిరీ సిఈవో ఆడారి ఆనంద్ కుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న డెయిరీ డైరెక్టర్లు దాడి గంగరాజు, గేదెల సత్యనారాయణ తదితరులు

## లక్ష్మీపురం గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలి



ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

నాతవరం : లక్ష్మీపురం గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎంపిడిఒ యాదగిరీశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. మండలంలో చెర్లోపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మూడు శివారు గ్రామాలైన లక్ష్మీపురం, పార్వతీపురం, సీతారామ పురం గ్రామాలను చెర్లోపాలెం పంచాయతీ నుండి వేరుచేసి లక్ష్మీపురం పంచాయతీగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కొత్తగా పంచాయతీలను ఏర్పాటు చేసుకొనుటకు అవకాశం ఇచ్చినందుకు అధికారులు గ్రామసభ ఏర్పాటు చేసి కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు రాజాన సూర్యచంద్ర, గ్రామస్థులు పాల్గొన్నారు.



**24వవార్డులో సచివాలయ అధికారులతో వార్డు వాలంటీర్‌ల సమక్షంలో ప్రజలకు అందే పథకాలకు రైస్‌కార్డు, ఆరోగ్యశ్రీ, అమ్మఒడి, వార్డులో జరిగే సమస్యలపై వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు ఎడ్మిన్ గణేష్‌కుమార్, జోన్-3 టిఎల్‌ఎఫ్ ప్రెసిడెంట్ బెహరా వెంకట రత్నం, వార్డు అధ్యక్షులు ఎస్.సన్యాసిరావు, వార్డు నాయకులు పి.ప్రసాద్, పెదబాబు, ఎస్.రవీంద్ర, ముస్తాఫా, వి.శ్రీను, నర్సింగ్, సత్యానందం, వార్డు నాయకులు, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.**

## జనవరి 8న సకల జనుల సమ్మెను జయప్రదం చేయండి



నర్సీపట్నం : జనవరి 8న జరుగు దేశవ్యాప్త సకల జనుల సమ్మెను జయప్రదం చేయాలని శుక్రవారం నర్సీపట్నం సిఐటియు కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వర రావు మాట్లాడుతూ కనీస వేతనాలు, కార్మిక చట్టాలు సవణ చేస్తూ కార్మికుల హక్కులకు పై బిజేపి దాడి చేస్తుందన్నారు. అలాగే ఎన్‌ఆర్‌సి తీసుకు వచ్చి కార్మకుల ఐక్యతను దెబ్బతీస్తుందన్నారు. మరో ప్రక్కన అధిక ధరలు, వ్యవసాయాన్ని దీవాలతీసే విదానాలు అనుచరిస్తుందన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కార్మికులను అక్రమ తొలగింపు, రాజకీయ వేధింపులకు గురి చేస్తుందన్నారు. ఈ సమస్యలు పరిష్కారం కోసం జరుతున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్వవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాద్యక్షలు సాపిరెడ్డి నారాయణమూర్తి, సిఐటియు మండల అధ్యక్షులు డి.సత్తిబాబు, కార్యదర్శి అడిగర్ల రాజు, మిడ్డేమిల్ పథకం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.ప్రసన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కె.రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయుకులు శివ తదితరులు పాల్గొన్నారు.

## వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీ హోమం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై కొలువైయున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీ హోమము ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గం.లకు పండితులు విఘ్నేశ్వర పూజ,పుణ్యాహవచనం,అమ్మవారికి మూల,మంత్ర జపములు,సప్తపతి పారాయణములు నిర్వహించారు. 11 గంటలకు పూర్ణహుతి గావించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు చల్లపల్లి.ప్రసాద్ శర్మ, కొంపెల్ల.మూర్తి, కూచిబొట్ల.ప్రసాద్, దేవులపల్లి.ప్రసాద్, ముత్య. వెంకట్రావు మరియు వేదపండితులు,అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసి రమేష్ బాబు,ఆలయ సిబ్బంది, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు. వేద పండితుల వేద ఆశీర్వాదములు అనంతరం భక్తులకు తీర్ధ,ప్రసాదములు అందజేశారు.

## మొదటి పేజీ తరువాయి

## 'పచ్చ' కుంభకోణంపై విచారణ జరిపిస్తాం

చేసిందన్నారు. బీసీజీ రిపోర్టు అనంతరం వాటిపై హైపవర్ కమిటీ సమీక్షించిన తరువాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని మంత్రి వెల్లడించారు. రాజధాని భూములపై రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. రాజధాని రైతులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని అన్నారు.

కలల రాజధాని నిర్మించారు..

సమావేశంలో పేర్ని నాని వివరాలను వెల్లడిస్తూ.. గత ప్రభుత్వ హయాంలో రాజధాని ప్రాంతంలో జరిగిన అవినీతి, కుంభకోణాలుపై మంత్రివర్గ ఉపసంఘం నివేదిక సమర్పించింది. వాటిపై మంత్రి మండలి చర్చించింది. చంద్రబాబుకు వాటాలు ఉన్న ఓ కంపెనీ రాజధాని ప్రకటనకు ముందే భూములు కొనుగోలు చేసింది. కొందరు మంత్రులు కూడా భూములు కొనుగోలు చేశారు. ఆస్తులు అక్రమంగా కొన్నవారు శిక్ష అనుభవించక తప్పదు. న్యాయనిపుణుల సలహా అనంతరం వీటిపై విచారణను ఆదేశిస్తాం. 2015లో అప్పటి ప్రభుత్వం ఊహాజనితమైన రాజధాని నిర్మించాలని కలలు కన్నది. శివరామకృష్ణ కమిటీ నివేదికను తుంగలో తొక్కుతూ.. మంత్రి నారాయణ ఇచ్చిన నివేదిక మాత్రమే పరిగణలోకి తీసుకుంది. 33 వేల ఎకరాల రైతుల భూములను, మరో ఇరవై వేల ఎకరాల ప్రభుత్వ భూములను కలిపి మొత్తం 54 వేల ఎకరాల్లో రాజధాని నిర్మాణం చేయాలని ప్రభుత్వం భావించింది. ఒక లక్షా పదివేల కోట్ల పైచిలుకు అంచనా వేశారు. కానీ ఐదేళ్ల కాలంలో కేవలం 5వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు అని అన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర..

దివంగత వైఎస్సార్ ప్రవేశపెట్టిన 108 అంబులెన్స్ వాహనాలను గత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భ్రష్టుపట్టించారు. వాటిని మరింత పటిష్టం చేయాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. 412 కొత్త వాహనాలకు కొనుగోలు చేస్తాం. వాటి కోసం రూ.71 కోట్లు కేటాయించాం. అలాగే వైద్య సేవలు కోసం రూ. 60 కోట్లతో 656 కొత్త 104 వాహనాలు కొనుగోలు చేస్తాం. కనీస మద్దతు ధరకు నోచుకోని, పసుపు, మిర్చి ఉల్లి, చిరుధాన్యాలు వంటి పంటలకు మద్దతు ధరలను ముందే ప్రకటిస్తాం. ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసేలా మంత్రిమండలి తీర్మానం చేసింది. కడప జిల్లా రాయచోటిలో నాలుగు ఎకరాల భూమిని వక్ఫ్ బోర్డుకు బదలాయిస్తూ నిర్ణయం తీసుకున్నాం. మచిలీపట్నం పోర్టు నిర్మాణం డీపీఆర్ తయారీకి రైట్స్ నిర్మాణ సంస్థకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నాం. ప్రభుత్వమే దీనిని సొంతగా నిర్మాణం చేయుటకు అనుమతులు మంజూరు చేశాం. రామాయపట్నం పోర్టుకు ముందడుగు పడింది. త్వరలోనే నిర్మాణం చేపడుతాం అని తెలిపారు.

ఏపీ రాజధానిపై ఇప్పట్లో నిర్ణయం లేనట్టే..!

అమరావతి ప్రాంతంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్, రాజధాని ప్రకటనకు ముందు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వాటాలు ఉన్న కంపెనీలు, మాజీ మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు, వాళ్ల బినామీలు కొనుగోలు చేసిన భూములపై న్యాయ నిపుణుల సలహా తీసుకుని విచారణ జరిపిస్తామని మంత్రి పేర్ని నాని తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణపై జీఎన్‌రావు కమిటీ ఇచ్చిన నివేదికలోని పలు అంశాలపై శుక్రవారం ఆంధ్రప్రదేశ్ కేబినెట్ చర్చించింది. జీఎన్ రావు కమిటీ నివేదిక, బీసీజీ నివేదికలు రెండింటిని క్రోడీకరించి తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి పేర్ని నాని తెలిపారు.

రైతుల అభిప్రాయం తీసుకున్నాకే రాజధానిపై ప్రకటన

'ఆస్తులు అక్రమంగా కొనుగోలు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదు. 2014 డిసెంబర్ 31న రాజధాని ప్రకటనకు ముందు జరిగిన భూముల కొనుగోళ్లపై దర్యాప్తు. మాజీ మంత్రులు, కుటుంబ సభ్యులు, కారు డ్రైవర్లు, ఎవరెవరు భూములు కొన్నారో గుర్తించాం. లోకాయుక్తా, సీబీఐ, సీఐడీల్లో ఏదో ఒక సంస్థతో దర్యాప్తు చేయిస్తాం. సీఆర్డీఏలో జరిగిన అవినీతిపై కేబినెట్ సబ్‌కమిటీ నివేదిక ఇచ్చింది. గత ప్రభుత్వం శివరామకృష్ణన్ కమిటీ నివేదికను పక్కన పెట్టింది. నారాయణ కమిటీ నివేదికను గత ప్రభుత్వం ఆమోదించింది. రాష్ట్రాభివృద్ధి, రాజధాని నిర్మాణంపై జీఎన్‌రావు కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించాం. బీసీజీ సంస్థ నివేదిక ఇంకా అందాల్సి ఉంది. రెండు నివేదికలు పరిశీలించేందుకు హైలెవల్ కమిటీ ఏర్పాటు. హైలెవల్ కమిటీ సూచనల మేరకు తుది నిర్ణయం తీసుకుంటాం. పాపం పండే రోజు వస్తే ఎవరూ దాక్కోలేరు. 29 గ్రామాల రైతులు ఆందోళన చెందొద్దు.. చెప్పుడు మాటలు వినొద్దు. కచ్చితంగా ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తుంది. చంద్రబాబు ప్రభుత్వం ఊహాజనితమైన రాజధాని నిర్మాణం చేయాలని నిర్ణయించింది. గత ఐదేళ్లలో టీడీపీ ప్రభుత్వం కేవలం 5వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని' మంత్రి వివరించారు.

## అమరావతి ప్రాంత రైతులకు అన్ని విధాలా న్యాయం చేస్తారు

తీరును ఎండగట్టారు. మూడు నాలుగు బిల్డింగ్‌లు కట్టి టీడీపీ నాయకులు ప్రచారాలతో ఊదరగొట్టారని ఎద్దేవా చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమరావతి ప్రాంత రైతులకు అన్ని విధాల న్యాయం చేస్తారని స్పష్టం చేశారు. జీఎన్ రావు కమిటీ అన్ని జిల్లాలు పర్యటించి ప్రజాభిప్రాయాలను సేకరించిన తర్వాతే ప్రభుత్వానికి నివేదిక అందించిందని వాసిరెడ్డి పద్మ వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం రాజధాని విషయంలో శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులను ఎందుకు పరిగణలోకి తీసుకోలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. చంద్రబాబు మాదిరి కాకుండా నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం చర్చించాకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తుది నిర్ణయంతీసుకుంటారన్నారు. అంతేకాకుండా సీఎం జగన్ అన్ని విధానాలను చట్టబద్ధంగానే అమలు చేస్తారని స్పష్టం చేశారు. తమకు న్యాయం చేస్తారనే నమ్మకంతోనే రాజధాని రైతులు వైఎస్ జగన్‌కు అధికార పట్టం కట్టారన్నారు. ఆరు నెలల పాలనలో సీఎం జగన్ ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలను తీసుకున్నారని పేర్కొన్నారు. దిశ చట్టం, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, అమ్మఒడి, ఇళ్లపట్టాలు మహిళ పేరుతో ఇవ్వడం, వెయ్యి దాటిన ఆరోగ్య ఖర్చును ఆరోగ్యశ్రీ పరిధిలోకి తేవడం వంటి ఎన్నో బృహత్కరమైన పథకాలను ప్రారంభించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. రాష్ట్రానికి నష్టం కలిగించే విధానాలను సీఎం ఎట్టిపరిస్థితుల్లో తీసుకోరని స్పష్టం చేశారు. రాజధాని పేరుతో రాష్ట్రానికి నష్టం చేకూర్చుందిన టీడీపీ నాయకులే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరచేతిలో వైకుంఠం అన్న చందంగా పాలన సాగించారని విమర్శించారు. రాజకీయ పార్టీ అన్న తర్వాత ఒకే పాలసీ ఉండాలని, టీడీపీ మాదిరి రోజుకో పాలసీ ఉండకూడదని వాసిరెడ్డి పద్మ వ్యాఖ్యానించారు.

# భక్తులందరికి మహా అన్నప్రసాద వితరణ

విశాఖపట్నం : నగరంలో ఏ ప్రాంతంలో నివసిస్తున్న వారైననూ, కులంతో సంబంధం లేకుండా అన్ని కులముల వాళ్ళు పాల్గొని సత్యనారాయణ స్వామి వారి వ్రతము చేసుకొనవచ్చునని,

సత్యనారాయణస్వామి వ్రతమునకు కావలసిన వస్తువులు, పువ్వులు, పండ్లు, కొబ్బరి కాయలు, స్వామి వారి ప్రసాదం మొదలైన సమస్త సామగ్రి భక్తమండలి వారు సమకూరుస్తారని,

వ్రతం అనంతరం భక్తులం దరికి మహా అన్న ప్రసాదం కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని కార్యక్రమ ఛైర్మన్ కందుల వెంకటరెడ్డి తెలిపారు.

# నూతన సంవత్సర క్యాలెండర్, డైయిరీ ఆవిష్కరణ

విశాఖపట్నం : శ్రీ మహాకామేశ్వరి పీఠం పీఠాధిపతులు మహర్షి శ్రీ యద్ధనపూడి అయ్యన్న పంతులు సారథ్యంలో హోటల్ మేఘాలయలో 2020కి సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైయిరీ ఆవిష్కరణ అయింది. ఆచార్య సార్వభౌమ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి క్యాలెండర్‌ను, డెయిరీని ఆవిష్కరించారు. శ్రీ మహా కామేశ్వరి పీఠాధిపతులు మహర్షి శ్రీ యద్ధనపూడి అయ్యన్నపంతులు హోటల్ మేఘాలయలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విశాఖపట్నాన్ని క్యాపిటల్ సిటీగా ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నాన్ని క్యాపిటల్ సిటీగా ప్రకటించడం వల్ల విశాఖ పట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రాముఖ్యత కలగడమే కాకుండా అభివృద్ధి చెందుతుందన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై నమోదు చేసిన కేసులు 2020లో పటాపంచలైపోతాయన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం మరియు ప్రజలకోసం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అటు రాష్ట్రం, ఇటు ప్రజలు సుభిక్షంగా ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనకు ఢోకా లేదన్నారు. ఈ ఐదు సంవత్సరాలే కాక మరొక ఐదు సంవత్సరాలు రాష్ట్ర ప్రజల చేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టి తిరుగులేని నాయకుడిగా ప్రజాదరణ పొందుతారని తెలిపారు. అమరావతి నిర్మాణం నిమిత్తం రైతులనుంచి సేకరించిన భూమికి తిరిగి రైతులకు అన్యాయం జరగకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి తగు చర్యలు చేపట్టారన్నారు. ఈవిషయంలో రాష్ట్ర మంత్రులు కూడా తగు చొరవ చూపించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీ మహా కామేశ్వరి పీఠాధిపతిని మహర్షి శ్రీ యద్ధనపూడి అయ్యన్న పంతులు హృదయపూర్వక ఆశీస్సులనందజేశారు. 2020 సంవత్సరంలో



భారతదేశ ప్రధాని మోదీకి మరియు భారతీయ జనతా పార్టీకి భారతదేశ ప్రజల ద్వారా ఉన్నత స్థితి లభిస్తుందన్నారు. 2020 సంవత్సరంలో దైవానుగ్రహంతో అమ్మ వారి కటాక్షంతో ఆంధ్ర రాష్ట్ర ప్రజలే కాక యావత్ భారతదేశ ప్రజలు కూడా సుఖ సంతోషాలతో జీవిస్తారని తెలిపారు. దైవానుగ్రహం మెండుగా ఉండడం వలన 2020 సంవత్సరం అంతా బాగుంటుందని తెలిపారు. 2020 నూతన సంవత్సర క్యాలెండర్ డెయిరీ ఆవిష్కరణలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, పీఠం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి

విశాఖ సిటీః రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎన్. రమేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం నాడు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఆయన తన కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన గతంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా అవలంభించిన పద్ధతులనే ఈ ఎన్నికల్లో కూడా పాటించనున్నట్లు తెలిపారు.

ఎన్నికల నిర్వహణ కై కేటాయించనున్న సిబ్బందిని ర్యాండమైజేషన్ పద్ధతిలో కంప్యూటర్ ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. ఎన్నికల విధుల్లో స్థానిక ఉద్యోగులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఒక మండలంలోని ఎంపీటీసీ, జెడ్ పి టి సి ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తారని తెలిపారు.

జిల్లాలోని అన్ని మండలాల లో దశలవారీగా ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. బ్యాలెట్ బాక్సులను మరమ్మతులు చేయించి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. జిల్లా పరిషత్ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈవో స్థాయి అధికారులు వ్యవహరిస్తారని తెలిపారు. మండల పరిషత్ ఎన్నికల్లో మండల ప్రత్యేక అధికారులు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని తెలిపారు. ఆదర్శ ప్రవర్తనా నియమావళి ( మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) గత శాసనసభ, పార్లమెంటు ఎన్నికల మాదిరే ఉంటుందని తెలిపారు. ఎన్నికలలో సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు ఉంటారని తెలిపారు. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు ప్రతి 3 రోజులకు ఒకసారి సమర్పించే ఖర్చు వివరాలను రిటర్నింగ్ అధికారులు తమ బృందాలతో పరిశీలిస్తారని తెలిపారు. ఈ బృందాలలో లోకల్ ఫండ్ ఆడిటర్లు ఇతర సంబంధిత అధికారులు ఉంటారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎమ్మార్వో, ఎంపీడీవో, స్టేషన్ హౌస్ ఆఫీసర్ లు పోలింగ్ స్టేషన్లను క్రిటికల్, హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్ లుగా వర్గీకరించుకోవాలని, ఆ ప్రకారం బలగాలను కేటాయించాలని తెలిపారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఓటు వేసేందుకు అనువైన వాతావరణాన్ని నెలకొల్పాలని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులను ఎంపిక చేసి, తగు శిక్షణ ఇచ్చి, సాఫ్ట్ వేర్ అందజేసి వెబ్ కాస్టింగ్ చేయించాలని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ అధికారులకు ఇప్పటికే శిక్షణ పూర్తి అయిందని తెలిపారు. రిజర్వేషన్ వివరాలను మూడు, నాలుగు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. దివ్యాంగ ఓటర్లకు అనుకూలంగా ఉండేటట్టుగా పోలింగ్ స్టేషన్లను తీర్చిదిద్దుతామని తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ గిరిజా శంకర్ మాట్లాడుతూ జనవరి 5వ తేదీలోగా ఎన్నికల మెటీరియల్ ను జిల్లాలకు పంపిస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో డేటాను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ మాట్లాడుతూ పెద్ద బ్యాలెట్ బాక్సులు కావాలని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీడీవో, ఈవో పి ఆర్ డి పోస్టులను భర్తీ చేయాలని, తద్వారా ఎన్నికలను సజావుగా నిర్వహించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనరు రాజీవ్ కుమార్ మీనా, రూరల్ ఎస్పీ ఏ. బాబూజీ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగార్జున సాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## సైన్యం రాజకీయమయం

సైన్యాధిపతి పదవిలో ఉండి కూడా జనరల్ బిపిన్ రావత్ పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనలపై మాట్లాడటం దిగ్భ్రాంతిని కలిగిస్తున్నది. రావత్ వ్యాఖ్యలు సమంజసమైనవా? కాదా? అనేది కూడా ఇక్కడ చర్చించాల్సింది. దేశ రాజకీయాలపై, ఆంతరంగిక విషయాలపై సైన్యాధికారులు మాట్లాడటం మన దేశంలో పాతుకుపోయిన ప్రజాస్వామ్య సంస్కృతికి విరుద్ధం. అందుకే ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాలతో పాటు ప్రజాస్వామ్య ప్రియులంతా ఉలిక్కిపడేలా చేశాయి. నాయకత్వం అంటే నడిపించడానికి సంబంధించినది. మీరు ముందుకు నడిస్తే ప్రతి ఒక్కరూ అనుసరిస్తారు. గుంపులో కూడా నాయకులు కనిపిస్తారు. కానీ నాయకులంటే ప్రజలను మంచి మార్గంలో నడిపించేవారు. ప్రజలను అనుచితమైన దారిలో నడిపేవారు నాయకులు కారు అంటూ నగరాల్లో వీరు జన సమూహాల్ని హింసా విధ్వంసాలు సాగించేవిధంగా నడిపిస్తున్నారని ఆయన తప్పుబట్టారు. ఇటువంటి విధానం నాయకత్వం అనిపించుకోదని ఆయన అన్నా రు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ రావత్ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కొద్దిరోజులుగా దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగుతున్నాయనేది తెలిసిందే. ప్రధాని మోదీ కూడా ఈ నిరసనల పట్ల తీవ్రంగా స్పందించిన సందర్భమిది. దేశీయ వ్యవహారాల్లో తటస్థంగా ఉండవలసిన సైన్యాధిపతి ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా వ్యాఖ్యానించడం విమర్శలకు తావిస్తున్నది. జనరల్ రావత్ వ్యాఖ్యలపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నుంచి తక్షణ స్పందన కనిపించింది. తమ అనుచరులను ఊచకోతకు, మత హింసకు అనుమతించేవారు (నాయకులు) కారా? మీరు ఏకీభవిస్తారా జనరల్ సాహెబ్ అని కాంగ్రెస్ పార్టీ ప్రముఖుడు దిగ్విజయ్‌సింగ్ ఒక ట్వీట్‌లో ప్రశ్నించారు. నేను ఆయనతో ఏకీభవిస్తున్నా. అవును, ప్రజలను నాయకులు మంచి మార్గం లో నడిపించాలె. ఆయన ఈ మాటలు అనే ముందు ప్రధానిని దృష్టిలో పెట్టుకొని ఉంటారు అని స్వరాజ్ ఇండియా నేత యోగేంద్ర యాదవ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. పౌరసత్వ సవరణ చట్టంపట్ల నిరసనలకు వ్యతిరేంగా సైన్యాధిపతి బిపిన్ రావత్ రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ఇవాళ సైన్యాధిపతిని రాజకీయ అంశాలపై మాట్లాడనిస్తే, రేపు సైన్యం అధికారం చేపట్టే ప్రయత్నానికి అనుమతి ఇచ్చినట్ట వుతుంది అని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బ్రిజేష్ కాలప్ప తీవ్రంగా స్పందించారు. ఇటీవలి కాలంలోనే మరో సైనికాధికారి కూడా రాజకీయ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తూర్పు విభాగ సైనిక కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ అనిల్ చౌహాన్ కూడా ఈ నెల 14వ తేదీన కోల్‌కతాలో పౌరసత్వ సవరణ చట్టానికి అనుకూలంగా మాట్లాడారు. ఒకట్రెండు ఈశాన్య రాష్ట్రాలు అభ్యంతరం చెప్పినప్పటికీ, ప్రస్తుత కేంద్ర ప్రభు త్వం ఎంతోకాలం పక్కనపెట్టిన అంశాలపై దృఢమైన నిర్ణయాలు తీసుకుంటున్నది అని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలు యథాలాపంగా వెలువడ్డవి కావు. సైన్యం క్రమంగా రాజకీయమయం కావడాన్ని ఈ వ్యాఖ్యలు సూచిస్తున్నాయనే అనుమానం కలుగుతున్నది. బాధ్యతాయుత పదవి లో ఉన్న లెఫ్టినెంట్ జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యలే అభ్యంతరకరంగా ఉన్నాయంటే, ఇక సైన్యాధిపతి స్థానంలో ఉన్న రావత్ ఇదే కోవలో మాట్లాడటం మరింత ఆక్షేపణీయం. జనరల్ రావత్ ఈ నెల 31న పదవీ విరమణ పొందవలసి ఉన్నది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనే అత్యంత కీలక పదవికి జనరల్ రావత్‌ను ఎంపిక చేసే అవకాశం ఉందనే వార్త ఒకటి ఇప్పటికే వ్యాపించింది. ఉత్తరాది సైనిక విభాగ కమాండర్ రణబీర్ సింగ్ కూడా ఈ పదవి కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఇంకా వెలువడ లేదు. ఈ దశలో రావత్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయకుండా జాగ్రత్తగా ఉండాల్సింది. రాజకీయాల్లో సైన్యం తటస్థంగా ఉంటుందంటూ, మన ప్రజాస్వామ్యవ్యవస్థకు మన దేశ సైన్యం గొప్ప వరం వంటిదని లెఫ్టినెంట్ జనరల్ డీఎస్ హుడా ఇటీవలే ఒక సందర్భంలో గొప్పగా చెప్పుకున్నారు. గతేడాది పాకిస్థాన్ సైన్యాధిపతి జనరల్ ఖమర్ జావేద్ బజ్వా ఒక సమావేశంలో మాట్లాడుతూ భారత సైన్యాన్ని ప్రశంసించారు. ప్రభుత్వాన్ని నడుపడం సైన్యం పనికాదని అం టూ, సైన్యం రాజ్యాంగం నిర్వచించిన పాత్రకే పరిమితం కావాలని ఆయన హితవు చెప్పారు. భారత ప్రజాస్వామ్యం, సైన్యం పాత్ర గురించి తెలుసుకోవడానికి ఈ విషయమై చర్చించిన ఒక పుస్తకాన్ని చదువవలసిందిగా ఆయన పాక్ సైనికాధికారులకు సూచించారు. అనేక ఆసియా ఆఫ్రికా దేశాలలో సైనిక తిరుగుబాట్లు వచ్చినప్పటికీ, మన దేశంలో ప్రజాస్వామ్యం నిలదొక్కుకోవడాన్ని ప్రపంచమంతా ప్రశంసిస్తున్నది. లెఫ్టినెంట్ జనరల్ చౌహాన్ లేదా సైన్యాధిపతి రావత్‌లసహా మన సైన్యంలోని అధికారుల నిజాయితీని ఎవరూ శంకించడంలేదు. మనదేశ సైన్యం ప్రజా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందనేది కలలో కూడా ఊహించలేం.

# సృజనాత్మకతను వెలికితీయడానికే యువజనోత్సవాలు

## శాసన సభాపతి తమ్మినేని సీతారాం



శ్రీకాకుళం: యువతలోని సృజనాత్మకతను వెలికితీయడానికే యువజనోత్సవాల కార్యక్రమమని శాసన సభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి యువజనోత్సవాల కార్యక్రమానికి స్పీకర్ ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో నిబిడీకృతమై న శక్తులను వెలికి యువజనోత్సవాల కార్యక్రమమని అన్నారు. పుస్తకాలతో పాటు క్రీడలు, మంచి సంస్కృతినీ, అలవర్చుకోవాలన్నారు. అన్ని విషయాలపై పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. మన దేశంలో యువత అధిక శాతం ఉన్నారని, యంగ్ ఇండియాగా విదేశీయులు సంభోదిస్తారుని తెలిపారు. యువత సహజ శక్తులను దేశ ప్రయోనాలకు ఉపయోగించాలని కోరారు. ఎక్కువగా మానవ వనరులు వున్న, దేశం మన దేశమేనన్నారు. అధిక జనాభా కలిగిన చైనా బలమైన మానవ వనరులుగాను, శక్తివంతంగా రూపొందించుకున్నదన్నారు. నిరక్షరాశ్యత, పేదరికం, వంటి సమస్యలను పారద్రోలాలని, వైఫల్యాలనుండి బయటపడాలని చెప్పారు. వైఫల్యాలు విప్లవానికి నాంది అని అన్నారు. ఇంజనీర్లు, డాక్టర్ల వంటి వున్నత విద్యావంతులు నిరుత్సాహంతో ఆటవిక సమాజం వైపు నెట్టబడ్డుతున్నారని, విజ్ఞానాన్ని దేశాభ్యున్నతికి వినియోగించాలన్నారు. ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలబెట్టే బాధ్యత యువతదేనన్నారు. శత్రు దేశాలను సైతం దేశ భక్తి, విజ్ఞానమనే ఆయుధాలతో ఎదుర్కోవాలన్నారు. భావిభారత మేధావులుగా ప్రగతి పథాన నిలపాలన్నారు. ప్రభుత్వం అనేక అవకాశాలను యువతకు అందిస్తున్నదన్నారు. ఆరు నెలల కాలంలోనే నాలుగు లక్షల ఉద్యోగాలను అందించి ఒక సునామీని సృష్టించారన్నారు. త్వరలోనే మెగా డి.ఎస్.సి.ని ప్రకటిస్తారని, అన్ని ప్రభుత్వ శాఖలలోని ఖాళీలను భర్తీ చేస్తారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని, దేశ భవిష్యత్తుకు యువత తమ శక్తిని వుపయోగించాలన్నారు. సంఘాన్ని సంపన్నం చేయాలని పిలుపునిచ్చారు. సాఫ్ట్ వేర్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. ఇంగ్లీషు భాష ఒక లింక్ లేంగ్వేజ్ అని ఆ భాషలో పట్టు సంపాదించాలని, అదే విధంగా మన మాతృభాషను మరువరాదని అన్నారు. మన ముఖ్యమంత్రి మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. దిశ చట్టాన్ని లోక్ సభ స్పీకర్ సైతం మెచ్చుకున్నారని, అన్ని రాష్ట్రాల లోను అమలు చేసే విధంగా చట్టాన్ని రూపొందిం చుకునే నిర్ణయాన్ని తీసుకున్నారన్నారు. ఈ యువజనోత్సవాలలో గెలుపొందిన వారు విశాఖపట్నంలో జరిగే రాష్టస్థాయి పోటీలకు వెళ్తారన్నారు.

ఉత్తర ప్రదేశ్ లోని లక్నోలో జాతీయ స్థాయి పోటీలు వివేకానందుని జన్మదినం రోజున జరుగుతాయని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలలో గెలుపొంది మన జిల్లా పేరు నిలబెట్టాలని హితవు పలికారు. సంయుక్త కలెక్టర్ కె. శ్రీనివాసులు మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి కృషి చేస్తున్నదన్నారు. జాతీయ స్థాయి లో జిల్లా పేరు నిలపాలని కోరారు. ముందుగా స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభం అయినది. ఆఖరున జిల్లా స్థాయికి ఎంపికయిన వారికి మెమెంటోలను అందచేసారు.

ఈ కార్యక్రమానికి సెట్‌శ్రీ సి.ఇ.ఓ బి. ప్రసాద రావు, ఎన్.వై.కె. కో ఆర్డి నేటర్ శివ ప్రసాద రెడ్డి, ఇంటాక్ కన్వీనర్ కె వి జె. రాధా ప్రసాద రావు, ప్రో.విష్ణుమూర్తి, జిల్లా పర్యాటక అధికారి ఎన్. నారాయణ రావు, సురంగి మోహన్ రావు, పెంకి చైతన్య కుమార్, కాలేజీ ప్రిన్సిపాల్స్ లచ్చన్న, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా వావిలపల్లి జగన్నాధం నాయుడు వ్యవహరించారు.



# నాయకుల పుట్టిన రోజు ప్రాణదానానికి వేదిక కావాలి



అనకాపల్లి : ప్రతీ నాయకుడి పుట్టిన రోజు మరొక వ్యక్తికి ప్రాణదానానికి వేదిక కావాలని సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపకులు కోరిబిల్లి పరి అన్నారు. ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రతి నాయకుడి పుట్టిన రోజున వారి అభిమానులు రక్తదానం చేయాలన్నారు. దీని వలన అనేక మంది ప్రాణాలు నిలుస్తాయన్నారు.

ఇటీవల జరిగిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎన్టీఆర్ వైద్యాలయంలో నిర్వహించిన బ్లడ్ క్యాంపులో 50 బ్యాగుల రక్తం లభించిందన్నారు. అలాగే రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి పెద్దలు సీనియర్ రాజకీయ నాయకులు దాడి వీరభద్రరావు. ఎమ్మెల్యే అమర్ ఎంపీ భీశెట్టి సత్యవతి. దాడి రత్నాకర్ .దాడి జయవీర్ పుట్టినరోజుల సందర్భంగా బ్లడ్ క్యాంపులు నిర్వహిస్తే మరి కొన్ని వందల బ్లడ్ బ్యాగులు కూడగట్టే అవకాశం ఉందన్నారు. దీని వలన వైసీపీ కార్యకర్తలు నాయకులకు మంచి పేరు లభిస్తుందన్నారు. దీని వలన ఎంతో మందికి ప్రాణదానం చేసిన ఘనత దక్కుతుంది. దీంతో పాటు నియోజకవర్గ పరిధిలోని నాయకులు దంతులూరి దిలీప్ కుమార్. మళ్ళ బుల్లిబాబు గొర్లి సూరిబాబు, గొల్లవిల్లి శ్రీనివాసరావు , ఎంపీ సత్యవతి తనయుడు డాక్టర్ యశ్వంత్ , దంతులూరి శ్రీధర్ రాజు , పలకా రవి, జాజుల రమేష్, నారపిన్ని చంద్రశేఖర్ ,.కొత్తురు జగన్ తదితర నాయకులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఇతర వైసీపీ నాయకుల జన్మదినోత్సవ సందర్భంగా కూడా క్యాంపులు ఏర్పాటు చేయాలని దానికి సర్వేజన ఐక్య వేదిక పూర్తి సహకారం అందిస్తుందని ఆయన అన్నారు.

## సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయండి



అనకాపల్లి : శనివారం విశాఖపట్నం వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యాటన విజయవంతం చేయాలని, అనకాపల్లి శాసన సభ్యులు గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజదానిగా విశాఖాను ప్రకటించిన తర్వాత మొట్ట మొదటి సారిగా వస్తున్న జగన్మోహన్ రెడ్డి పర్యాటన విజయవంతం చేయడానికి ప్రతీ ఒక్క కార్యకర్తల తరలి రావాలన్నారు. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సిఎం శంకుస్థాపన చేయనున్నారని ఇందులో భాగంగా అనకాపల్లి నియోజక వర్గానికి 50 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసారని అమర్‌నాథ్ అన్నారు. పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు (జాని) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దాడి రత్నాకర్, దంతులూరి దిలీప్ కుమార్, మళ్ల బుల్లిబాబు, పలకా రవి గొర్లి సూరిబాబు, ఆళ్ల నాగేశ్వరరావు, కొణతాల మురళీకృష్ణ, పొలమరశెట్టి మురళీ, జాజుల రమేష్ పాల్గొన్నారు.

# ఎప్పటికైనా అమరావతే ప్రజా రాజధాని

## ప్రభుత్వానికి చంద్రబాబు కౌంటర్ ఎటాక్

అమరావతి: ఎప్పటికైనా అమరావతి ప్రజా రాజధాని అని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు అన్నారు. 13 జిల్లాల అభివృద్ధికి కావాల్సిన.. ఆదాయ వనరుల్ని సమకూర్చే రాజధాని అమరావతి అని చెప్పుకొచ్చారు. ఏపీ కేబినెట్ భేటీ అనంతరం మంత్రి పేర్ని నాని మాట్లాడిన మాటలకు చంద్రబాబు కౌంటర్ ఇచ్చారు. మంత్రులు రోజుకో మాట మాట్లాడి గందరగోళానికి గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంపద ఎలా సృష్టించాలో వీళ్లకు తెలుసా?, నా 40 ఏళ్ల అనుభవాన్ని గుర్తు చేస్తున్నారు, అభివృద్ధి చేసి సంపద సృష్టిస్తే అది రాష్ట్రానికి ఆదాయ మార్గం అవుతుంది. 65శాతం తెలంగాణ ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోంది. ముంబై, బెంగళూరు, చెన్నై ఆయా రాష్ట్రాలకు ఆర్థిక వనరులుగా తయారయ్యాయి అని చెప్పారు. రాజధానిపై ప్రభుత్వం 7 నెలలుగా మీనమేషాలు లెక్కిస్తోందని మండిపడ్డారు. 5 కోట్ల మంది ఆంధ్రులు ఆలోచించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. అమరావతిలో 9 వేల కోట్లకుపైగా పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. డబ్బులు లేకుండా రాజధానిని కట్టాలన్న ఆలోచనలో భాగమే ల్యాండ్ పూలింగ్ చేపట్టినట్లు తెలిపారు. రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తుచేశారు. భూములు ఇచ్చిన రైతులకు ఆమోదయోగ్యమైన ప్యాకేజీ ఇచ్చినట్లు వెల్లడించారు. రాజధానిలో భూమిలేని వారికి రూ.2500 పెన్షన్ కూడా ఇచ్చామన్నారు. ఈ విధానాన్ని ప్రపంచం మొత్తం అధ్యయనం చేసే పరిస్థితి కల్పించినట్లు స్పష్టం చేశారు. డబ్బులు లేకపోతే ఇక్కడే అన్ని సౌకర్యాలు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. వైసీపీ నేతలు ఇక్కడి నుంచే పాలన చేయొచ్చు కదా?, అసెంబ్లీ లేకపోతే ఎక్కడ సమావేశాలు పెట్టారు?, ఇవాళ కేబినెట్ సమావేశం శ్మశానంలో పెట్టారా?, హైదరాబాద్‌లో నా ముద్ర ఉంది. హైదరాబాద్, సికింద్రాబాద్ చాలనుకుంటే సైబరాబాద్ వచ్చేది కాదు, హైదరాబాద్‌లో ప్రభుత్వ భూమి ఉంది.. ఇక్కడ రైతులు ఉదారంగా ఇచ్చారు అని పేర్కొన్నారు.

# పరిశ్రమలకు సమ్మె నోటీసులు



అచ్యుతాపురం : జనవరి 8 న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని సిఐటియు నాయకులు శుక్రవారం సెజ్ లో గల పరిశ్రమలకు సమ్మె నోటీసులు అందజేశారు . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టే విధంగా జనవరి 8 న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు . కార్మికులకు కనీసవేతనం 21 వేలు ఇవ్వాలని , అచ్యుతాపురం కేంద్రంగా ఈ ఎస్ ఐ ఆసుపత్రిని నిర్మించాలని , స్థానికులకు , నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని , అసంఘటిత రంగ కార్మికులకు పింఛన్ తో కూడిన సమగ్ర చట్టం చేయాలని జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు .ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు తదితరులు ఉన్నారు.

# స్వచ్ఛ భారత్ పై అవగాహన

అన్నవరం. : తూ.గో.జిల్లా పౌర సంభంధాల శాఖ వారి ఆద్వర్యంలో స్వచ్ఛ భారత్ ప్రచార రథం నందు శుక్రవారం అన్నవరం స్దానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గం.లకు ప్రచార రథంలో ఉంచే టెలివిజన్ ద్వారా పాఠశాల విద్యార్థులు అందరికీ స్వచ్ఛ భారత్ పై వివిధ అంశములపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా తడి,పొడి చెత్తలను ఎలా వేరు చేసి వర్మి కంపోస్ట్ తయారు చేయడం,బహిరంగ మల,మూత్ర విసర్జన చేయకుండా ఉండటం,భోజనానికి ముందు వెనుక ఎందుకు చేతులు శుభ్ర పరచుకోవాలి,పరిసరాలను ఎలా శుభ్రము చేసుకోవాలి తదితర అనేక అంశాలపై స్వచ్ఛ భారత్ ప్రచార రథం పై విద్యార్థులు అందరికీ అవగాహన కల్పించారు.ప్రచార రథంలో ఉన్న టెలివిజన్ ద్వారా వేసిన చక్కటి పాటలు పిల్లల్ని ఎంతగానో అలరింపజేసాయి.విద్యార్థులు అందరూ స్వచ్ఛ భారత్ రథం పై ఉన్న చిత్రాలను,నినాదాలను ఆసక్తిగా తిలకించారు.ఈ కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయులు రెడ్డి,రవి మాష్టారు,ప్రసాద్ తదితర ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు.

# మిస్టరీ వీడిన అనుమానాస్పద మృతి కేసు

## వారం రోజుల్లో కేసును ఛేధించి నిందితుడ్ని పట్టుకున్న సబ్బవరం పోలీసులు



సబ్బవరం : సబ్బవరం మండలంలో ఈ నెల 20వ తేదీన అమృతపురం శివారు అమరపినివానిపాలెం రైవాడ కాలువ గట్లు దగ్గర అనుమానాస్పద స్థితిలో కాలిపోయి మృతి చెందిన వ్యక్తి కేసును స్థానిక పోలీసులు చాకచక్యంగా ఛేధించారు. కేవలం 30 వేల రూపాయలు కోసం తన స్నేహితుడే మృతుడ్ని హత్య చేసినట్టు పోలీసులు దర్యాప్తులో తేలింది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు పోలీసులు విలేఖర్ల సమావేశంలో శుక్రవారం వెల్లడించారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక సిఐ ఆర్.వి.వి.ఎస్ చంద్రశేఖర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరి మండలం కొరపర్తి గ్రామానికి చెందిన దారపర్తి పోతురాజు కుమారుడైన దారపర్తి దేముడుబాబు (సాయి) 18 అక్కడ కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇతనికి ఈ మధ్య కాలంలో దేవరాపల్లికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి గాజువాక, శ్రీనగర్ సమీపంలో గల సంజీవయ్య నగర్ సమీపంలో ఆటో గ్యేరేజ్‌లో పని చేస్తున్న జొన్న నర్శింహమూర్తి, దారపర్తి దేముడుబాబు, రామకృష్ణకు ఇరువురికి నివాస నిమిత్తం రూమ్ కావాలని పరిచయం చేయడంతో నర్శింహమూర్తి తన ఇంటి ప్రక్కన గల వేరొక రూమ్‌ను ఇరువురు ఉండేందుకు ఆశ్రయం కల్పించారు. అప్పటికే ఆటో డ్రైవర్ అయిన జొన్న నర్శింహమూర్తి వివాహం నిమిత్తం నకు 40 వేల రూపాయలు రూమ్‌లో దాచుకుని ఉన్నాడు. ఖాళీగా తిరుగుతున్న దారపర్తి దేముడుబాబు, నర్శింహమూర్తి దాచుకున్న 40 వేల రూపాయలపై కన్ను వేసి వాటిని కాజేసి నవంబర్ నెల ఆఖరిలో పరారయ్యాడు. దీంతో నర్శింహమూర్తి గదిలో డబ్బులు కనిపించక పోవడంతో దేముడుబాబు కూడా పరారవ్వడంతో అనుమానం వచ్చి గాజువాక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసాడు. అనంతరం స్నేహితుడైన రామకృష్ణ, నర్శిమూర్తి పరారైన దేముడుబాబు కోసం వెతకడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో రామకృష్ణకు దేముడుబాబు డిశంబర్ 16వ తేదీన కొత్తవలస ప్రాంతంలో కనిపించడంతో దేముడుబాబును దగ్గర ఉండి రామకృష్ణ తీసుకు వచ్చి నర్శింహమూర్తికి అప్పగించాడు. దీంతో డిశంబర్ 17న దేముడు బాబును నర్శింహమూర్తి శ్రీనగర్‌లో గల రూమ్‌లోకి తీసుకెళ్లి 40 వేల రూపాయలు గురించి ఆరా తీసారు. దీంతో డబ్బులు తాను తీసుకున్నానని 30 వేలు ఖర్చు అయిపోయి 10 వేలు మిగిలాయని ఆ 10 వేలు తీసుకోమని నర్శింహమూర్తికి 10 వేలు అందించాడు. మిగిలిన 30 వేలు నిమిత్తం వసూలు చేసే క్రమంలో దేముడుబాబును కాళ్లు, చేతులు కట్టి నర్శింహమూర్తి రూమ్‌లో బంధించి దేముడు బాబు తండ్రి దారపర్తి పోతురాజుకు, మరియు బంధువులకు నర్శింపమూర్తి ఫోన్ చేసి దేముడుబాబు డబ్బులు దొంగతనం చేసాడని వాటిని ఇవ్వడం లేదని మీరైనా స్పందించి ఆ 30 వేలు అందించాలని లేకపోతే దేముడుబాబుని చంపేస్తానని బెదిరించాడు. అనంతరం దేముడుబాబుతో తండ్రికి ఫోన్ ద్వారా విషయాన్ని చెప్పించాడు. అయితే దేముడుబాబు తండ్రి ఈ విషయంపై స్పందించక పోవడంతో రెండు రోజుల పాటు కాళ్లు, చేతులు కట్టి రూమ్‌లో ఉంచి కొట్టి చిత్ర హింసలు పెట్టాడు. తన సొమ్ము ఇవ్వాలని లేకపోతే చంపేస్తానని బెదిరించాడు. అయినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 17,18వ తారీఖుల్లో రామకృష్ణను పిలిపించి తాను ఎన్ని చిత్రహింసలు పెట్టినా దేముడుబాబు డబ్బులు ఇవ్వడం లేదని నీవైనా నచ్చ జెప్పమని రామకృష్ణకు చెప్పడంతో స్పందించిన రామకృష్ణ డబ్బులు విషయంలో నాకు సంబంధం లేదని అది మీరిద్దరూ తేల్చు కోవాలని చెప్పి వెళ్లిపోయాడు. దీంతో కోప, ఉద్రికుడైన నర్శింహమూర్తి 19వ తేదీన ఇనుప పైపుతో దేముడు బాబు తల మీద శరీరంపై తీవ్రంగా కొట్టడంతో దేముడుబాబు అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయాడు. దీంతో గొడవులు విన్న చుట్టు ప్రక్కల వాళ్లు వచ్చి నర్శింహమూర్తిని అడుగగా డబ్బులు విషయంలో చిన్నపాటి స్నేహితుడు గొడవ పడినట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం అపస్మారక స్థితిలో ఉన్న దేముడుబాబును నర్శింహమూర్తి తన ఆటోలో ఉన్న గోనెను తీసుకు వచ్చి సంచిగా కుట్టి దేముడుబాబుని సంచిలో పెట్టి కుట్టి ఆటోలో పడేసి అర్థ రాత్రి సమయంలో శ్రీనగర్ నుండి జెర్రిపోతుల పాలెం మీదుగా సబ్బవరం మండలం అమృతపురం శివారు అమరపినివానిపాలెం రైవాడ కాలువ గట్టుకి తీసుకు వచ్చి పడేసి ఆటోలో ఉన్న డీజిల్‌ను బాటిల్‌లోకి తీసి దేముడుబాబుపై వేసి అగ్గిపెట్టెతో ముట్టించాడు. దీంతో దేముడుబాబు అటు, ఇటు కదలడంతో బయపడి పారిపోయాడు. అయితే అప్పటికే హెచ్‌పిసిఎల్ గ్యాస్ సెక్యూరిటీ సిబ్బంది గస్తీ తిరగడంతో ఆ ప్రక్కన పడి ఉన్న దేముడుబాబు మృత దేహాన్ని చూసి హెచ్‌పిసిఎల్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అధికార్లు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు రంగంలోకి దిగి మృతుడిపై ఉన్న బట్టలు తాయత్తు, రిస్ట్‌బ్యాండ్ ఆధారంగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పత్రికలకు తెలిపారు. 21వ తేదీన వచ్చిన న్యూస్‌ను చూసిన అనంతగిరిలో ఉన్న మృతుడు తండ్రి దారపర్తి పోతురాజు, కూతురు, అల్లుడు సబ్బవరం పోలీసును కలిసి తమ కుమారుడు కనిపించ లేదని పేపరులో వచ్చిన సమాచారం ప్రకారం తాయత్తు, రిస్ట్‌బ్యాండ్, బట్టలు తన కుమారుడివిగా గుర్తించి వచ్చామని చెప్పడంతో అప్పటికే తరలించిన దేముడుబాబు మృతదేహాన్ని తండ్రికి చూపించాడు. దీంతో మృతుడు దేముడుబాబు తన కుమారుడని గుర్తించి లబోదిబోమన్నారు. కేవలం 30 వేల రూపాయలకు ఆశపడి తన ప్రాణాలు కోల్పోవడంతో తన స్నేహితుడిని హింసించి చంపి నర్శింహమూర్తి సబ్బవరంలోని బొర్రపు గెడ్డ వద్ద 26న నర్శింహమూర్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు సిఐ తెలిపారు. ఈ దర్యాప్తులో తనకు సహకరించిన ఎస్సై దీనబంధు, కానిస్టేబుల్ నాగేంద్ర, నర్శింగరావు, సాయి, ఏఎస్సై వెంకట్రావును సిఐ చంద్రశేఖర్‌రావు అభినందించారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

FINANCE
ఒన్లీ రిటైర్డ్ పెన్షనర్లకు మాత్రమే
రూ. 30వేల నుండి 3 లక్షల వరకు
విశాఖ నుండి విజయవాడ వరకు
మధ్యలో ఎక్కడైనా సరే స్పాట్ ఫైనాన్స్
(with A/c Pay) చేయబడును.
JK అసోసియేషన్ సర్వీసెస్
Govt. Reg. No. 136/2009 (నో బ్రోకర్స్)
93969 99669

WANTED
HIGHER SOCIAL, ENGLISH, MATHS, PET TEACHERS, **P.A.** TO SCHOOL CHAIRMAN WITH PG & HIGH COMPUTER KNOWLEDGE (MALE OR FEMALE), SUPERVISOR FOR
**DAFFODILS SCHOOL,**
**MADHAVADHARA,**
**VUDA COLONY**.
Mail: daffodilprincipal@gmail.com
Daffodils
School for a bright future
CELL: 8096262345

2020 డైరీలు,
క్యాలెండర్లు
హోల్‌సేల్
భారతీయ స్టేషనరీ
& బుక్ సెంటర్
పూర్ణామార్కెట్
కార్ పార్కింగ్ ఎదురుగా
విశాఖపట్నం 530001
98499 92338,
2561749,

## 23వ వార్డులో వైయస్సార్ కార్యాలయం ప్రారంభం



నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో 23వ వార్డులో శుక్రవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ ప్రారంభించారు. ముందుగా దివంగత ముఖ్య మంత్రి వైయస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిం చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరికి అందుబాటులో ఉండాలని ఉద్దేశ్యంతో ఈ కార్యాల యంను ప్రారంభించామన్నారు. అనంతరం నూకాంబిక దేవ స్థానం బోర్డ్ చైర్మన్ ధనిమిరెడ్డి నాగు జన్మదిన వేడుకలు నిర్వహిం చారు. ఈ కార్య క్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసి పాత్రుడు, నాయకులు రాజు బాబు, రాజు, ప్రసాద్ తది తరులు పాల్గొన్నారు.

**IN THE HONOURABLE COURT OF VII ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM**
**A.S.55/2018**
**Between**
**Sri V.V.L.S. Murthy ... Appellant**
**And**
**T.Venkata Ramana and two others ... Respondents**

**SUBSTITUTED SERVICE OF SUMMONS BY WAY OF PAPER PUBLICATION AGAINST RESPONDENTS 2 AND 3**

**To**
**Smt.T.Girija Kameswari,**
**wife of T. Venkata Ramana**
**Hindu, aged 55 years,**
**Door No.5-9-10, Cinema Raju Street,**
**Kothapeta, Tuni, East Godavari District**
**... Respondent No.2**
**Smt.Bulusu Sridevi,**
**wife of Anantha Prasad**
**Hindu, aged 53 years,**
**Door No.21-2-15, Ganneru Street,**
**Changalaraopeta,**
**Visakhapatnam - 530 001 ... Respondent No.3**

**NOTICE**

Whereas the Appellant herein filed the above Appeal Suit to set aside the decree and judgment dated 26.10.2016 passed in O.S.1339/2004 by the Honourable I Additional Senior Civil Judge, Visakhapatnam. The matter stands posted to **03.01.2020** for your appearance.

You are therefore hereby called upon to appear before the Honourable Court either in person or by an Advocate on **03.01.2020 at 10.30 AM** failing which the matter will be determined in your absence.

**(M.RAMDAS)**
**Advocate**
**Door No.47-11-13,**
**Dwarakanagar**
**Visakhapatnam - 530 016**
Visakhapatnam
Date: 27-12-2019

**IN THE HONOURABLE COURT OF THE VII ADDL.DISTRICT JUDGE AT VISAKHAPATNAM**
**O.S.188/ 2016**
**Between**
**Verupanda Krishnam Murthy ...Appellant**
**And**
**Verupanada Sita Ramaswamy and others**

**NOTICE TO RESPONDENT No.10**

To
**Verupanda Somasekhar**
**S/o late Ugra Narasimha Murthy,**
**residing in Old Bazar Street, Opposite to Kalki Bhagavan Temple TUNI - 533401, East Godavari District, presently residing at C/o V. Sudhakar, Flat no 501, S S Gardens, Sector -2, MVP Colony, Visakhapatnam-530017.**

Please take notice that the appellant filed above appeal against the **Decree and Judgment dt.19-07-2016 IN OS 110/1997 of Honourable Junior Civil Judge, Bheemunipatnam** and the same is posted for your appearance in the above named court on **23-01-2020 at 10-30 A.M.** in person or through a Pleader dully instructed to answer the questions relating to the above proceedings and in default of your appearance on the aforesaid day, the case will be determined in your absence.

// BY ORDER OF THE HONOURABLE COURT //
**M.S.Goutham**
**Smt.Karlapudi Manjula**
**Thota Maheswara Rao**
**Advocates,**
**Visakhapatnam**
Visakhapatnam
Date:26-12-2019
**Cell No: 9949387480, 9441517059**

### ఈ నెల 31, జనవరి 2న

# గొర్రెల పొట్టేళ్ళు ప్రదర్శన విజయవంతం చేయండి

చోడవరం : చోడవరం పట్టణంలోని పశువైద్యశాలలో ఈ నెల 31న,ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు వద్ద జనవరి 2వ తేదీలలో జరగబోయే గొర్రెల పొట్టేళ్ళు ప్రదర్శనను విజయవంతం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ గొర్రెలు, మేకలు అభివృద్ధి సహకార ఫెడరేషన్ డైరెక్టర్ పినబోయిన అప్పారావు యాదవ్, విశాఖ జిల్లా గొర్రెల పెంపకం దార్లు సహకార యూనియన్ ఛైర్మన్ గంటా శ్రీరామ్ కోరారు. స్థానిక విలేఖరులతో శుక్రవారం మాట్లాడుతూ ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి ఒక్క రికీ మూడు వందలు నగదు, టిఫిన్ బాక్సు, మెడల్ ధృవీకరణ పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు.అదే విధంగా మొదటి బహుమతి 3వేలు, రెండవ బహుమతి 2వేలు, మూడవ బహుమతి 1 వెయ్యి రూపాయలు ఇవ్వడం జరుగు తుందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొంటున్నారని, పొట్టేళ్ళు ప్రదర్శన విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

# పేదలందరికీ సంక్షేమ ఫలాలు

**నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్**



లింగంపేటలో సచివాలయంకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ : గ్రామ సచివాలయాల ద్వారా ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని లింగం పేట, గాదంపాలెం, చోద్యం, గింజర్తి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా లింగంపేట, చోద్యం గ్రామాల్లో సచి వాలయాలకు శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ముఖ్య మంత్రిగా తన ఆరు నెలల పాలనలో నవరత్నాల హామీలు నెరవేరు స్తున్నట్లు తెలిపారు. త్వరలో అమ్మ ఒడి పథకం ద్వారా పాఠశాలకు వెళ్లే పిల్లల తల్లుల అకౌంట్లలో రూ.15వేల చొప్పున జమ కానుందని వివరించారు. ప్రతీ పేదవానికి ఏదో ఒక రూపంలో లబ్ధి చేకూరాలన్నదే ప్రభుత్వ లక్ష్య మన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చిటికెల భాస్కర నాయుడు, లెక్కల సత్య నారాయణ, సుర్ల గిరిబాబు, మాకి రెడ్డి నాయుడు, మండల పార్టీ నాయకులు రాయపురెడ్డి నాగేశ్వరరావు, పోలిరెడ్డి రాజబాబు, ఈవోపిఆర్‌డి ప్రభాకర రావు, వెలుగు ఏపిఎం గోవిందరావు, జెఇ ఢిల్లీశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వరస్వామి భక్తమండలి ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వ్రతములు

విశాఖపట్నం : వైకుంఠ ఏకాదశి సందర్భంగా విశాఖపట్టణం వన్ టౌన్ ప్రాంతంలో శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తమండలి వారి అధ్వర్యంలో వుడ్ యార్డ్ స్ట్రీట్ లో గల వాసవి కళ్యాణ మండపంలో జనవరి 6వ తేదిన సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతములు నిర్వహిస్తున్నట్లు భక్త మండలి అధ్యక్ష కార్యదర్శులు శ్రీయుతులు పల్లపోతుల వెంకటనూకరాజు మరియు బాదం వెంకట రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ఏ ప్రాంతంలో నివసిస్తున్న వారైననూ కులముతో సంబంధం లేకుండా అన్నికులముల వాళ్ళూ పాల్గొని సత్య నారాయణస్వామి వారి వ్రతం చేసుకొనవచ్చునని మరియు సత్యనారాయణ స్వామి వ్రతమునకు కావలసిన వస్తువులు - పువ్వులు, పండ్లు, కొబ్బరికాయలు, స్వామివారి ప్రసాదం మొదలైన సమస్త సామగ్రి భక్తమండలి వారు సమకూరుస్తారని మరియు వ్రతం కొబ్బరి కాయలు, స్వామివారి ప్రసాదం మొదలైన సమస్త సామగ్రి భక్తమండలి వారు సమకూరుస్తారని...

మరియు వ్రతం అనంతరం భక్తులందరికి మహా అన్నప్రసాదం (షడ్రసోపేతమైన భోజనం) కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని కార్యక్రమ చైర్మెన్ శ్రీ కందుల వెంకటరెడ్డి వారు తెలిపారు.

ఈ సామూహిక వ్రతాల్లో పాల్గొన దలచిన భక్తులు చరవాణి 9290621555 నందు గాని 9247825565 లో సంప్రదించి వారి గోత్ర నామములు నమోదు చేసుకోవాలన్నారు.

# విజయశ్రీ ఫార్మాలో మృతి చెందిన శ్రీధర్‌కు ముప్పై లక్షలు నష్టపరిహారం

***సిఐ రఘువీర్ విష్ణు, కెవిఆర్ చేతులు మీదగా అందజేత***



పరవాడ : జవహర్ లాల్ నెహ్రూ పార్మసిటిలో గల విజయశ్రీ పార్మలో గురువారము జరిగిన ప్రమాదంలో శ్రీదర్ మృతిచెందిన విషయము తెలిసిందే.ఈ ప్రమాదంపై విజయశ్రీ కంపెనీ యాజమాన్యం స్పందించి మ ృతుని కుటుంబానికీ ముప్పై లక్షలు రూపాయాలు నష్టపరిహారాన్ని అందజేస్తామనీ తెలిపారు. దీంట్లో బాగంగా లక్ష రూపాయాలును శుక్రవారము స్దానిక సిఐ రఘవీర్ విష్ణు,వర్కర్స్ యూనియన్ ప్రతినిదులు కన్నూరు వెంకట రమణ చేతులుమీదగా మృతుని కుటుంబానికి అందజేశారు. ఈకార్యక్రమంలో విజయశ్రీ ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నమ్మిదొడ్డి జంక్షన్‌లో గ్రామసభ

**ముఖ్యఅతిథిగా 55వ అధ్యక్షులు బట్టు**



పరవాడ : జీవీఎంసీ పరిది 55వ వార్డులో గల నమ్మిదొడ్డి జంక్షన్ లో శుక్రవారము గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వార్డుఅద్యక్షులు బట్టు సన్యాశిరావు హజరైన్నారు.

అనంతరము అయన మాట్లడుతూ వైయస్ అర్ ఆరోగ్య శ్రీ లబ్ధిదారులు జాబితాను విడుదల చేశారు. రాష్ట్ర అభివృద్ధి వైసిపితోనే సాధ్యపడతుందని ఈ సందర్భంగా అయన అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్స్, వైయస్ అర్ పార్టీ నాయకులు, ఎమ్‌పి రెడ్డి, వార్డు యూత్ ప్రెసిడెంట్ షణ్ముఖ శివ కుమార్, సమన్యాయ కమిటీ సభ్యులు మద్ది శ్రీను, యూత్ వైస్ ప్రెసిడెంట్ పిట్ట వెంకట్ రెడ్డి. పార్టీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్.సి.నెం.800/2019/సి.-తే.27-12-2019
తహసిల్దార్ వారి కార్యాలయం, సీతమ్మధార

**పత్రికా ప్రకటన**

విశాఖపట్నం నగర కాపురస్తులు శ్రీ గుడిమెట్ల యోగేంద్ర పేర్రెడ్డి తండ్రి చంద్ర రెడ్డి, గారు ఈ క్రింది పట్టికలో తెలపిన స్థలమునకు నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

| గ్రామము పేరు | సర్వేనెం. | విస్తీర్ణము (గజములలో) |
|---|---|---|
| దొండపర్తి | 43/3B2A | 266.40 |

పైన తెలిపిన భూమికి నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయుటకు ఎవరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన అందిన 15 దినముల లోగా శ్రీ తహసిల్దార్, సీతమ్మధార వారికి లిఖిత పూర్వకముగా తెలియ జేయవలసినదిగా కోరడమైనది.

తహసిల్దార్
సీతమ్మధార మండలం

ఆర్.సి.నెం.799/2019/సి.-తే.27-12-2019
తహసిల్దార్ వారి కార్యాలయం, సీతమ్మధార

**పత్రికా ప్రకటన**

విశాఖపట్నం నగర కాపురస్తులు శ్రీమతి మాత శాంతకుమారి భర్త సత్యనందరావుగారు ఈ క్రింది పట్టికలో తెలపిన స్థలమునకు నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

| గ్రామము పేరు | సర్వేనెం. | విస్తీర్ణము (గజములలో) |
|---|---|---|
| మద్దిలపాలెం | 7/2 పార్ట్ | 200 |

పైన తెలిపిన భూమికి నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయుటకు ఎవరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన అందిన 15 దినముల లోగా శ్రీ తహసిల్దార్, సీతమ్మధార వారికి లిఖిత పూర్వకముగా తెలియ జేయవలసినదిగా కోరడమైనది.

తహసిల్దార్
సీతమ్మధార మండలం

## సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

కోటవురట్ల : పొలంబడి కార్యక్రమంలో భాగంగా పంట సాగు విధానంలో రైతులు మెలుకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ లీలావతి అన్నారు. రాజుపేట, కోటవురట్ల, పాములవాక, జల్లూరు, గొట్టివాడ తదితర గ్రామాల్లో పర్యటించి రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి విడతగా గ్రామాల్లో ఐదు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. అనంతరం మండలంలో మొక్కజన్న సాగు చేస్తున్న మళ్ల వెంకటరమణ పొలాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, సచివాలయ సిబ్బంది, గణాంకాధికారి శ్రీనివాస్ ఉన్నారు.

## పేటీయం ద్వారా ఐసిఐసిఐ స్మార్ట్ పాలసీ

విశాఖపట్నం: వినియోగదారులకు అందుబాటులో పేటియం ద్వారా ఐసీఐసీఐ పృ ఐ ప్రొటెక్ట్ స్మార్ట్ పాలసీ అందుబాటులోకి వచ్చింది. పేపరు వర్కు అవసరం లేకుండా వెంటనే ఇన్సూరెన్స్ పాలసీ అందుబాటులోకి వుందని ఐసీఐసీఐ పృడెన్షియల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ పునీత్‌నంద ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పేటియంతో ఐసీఐసీఐ పృఐ ప్రొటక్ట్ స్మార్ట్ ఒప్పందం కుదుర్చుకుందన్నారు. దాదాపు నాలుగువందల మిలియన్ల మంది దేశంలో పేటీయం వాడుతున్నారని, దేశంలోనే పెద్దదైన పేమెంట్స్ యాప్‌గా పేర్కొన్నారు.

## పౌరసత్వ బిల్లు పై వ్యతిరేకంగా ముస్లింల ర్యాలీ



యానాం : కేంద్ర ప్రభుత్వం ఇటీవల పౌరసత్వ బిల్లును పార్లమెంటులో పెట్టి ఆమోద ముద్ర వెయ్యడానికి తీసుకుంటున్న చర్యలకు వ్యతిరేకంగా శుక్రవారం యానాం నియోజకవర్గంలోని ముస్లిములు పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వారి నమాజ్ పూర్తయిన వెంటనే మసీద్ దగ్గర నుండి ప్రారంభించి యానం పురవీధుల మీదుగా ర్యాలీ కొనసాగింది.

## నేడు, రేపు నెఫ్రాలజీ సదస్సు

విశాఖపట్నం : వైజాగ్ నెఫ్రో క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నేడు, రేపు నెఫ్రాలజీ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సీనియర్ మూత్రపిండ వ్యాధి నిపుణులు, అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ కె.వి.వేణుగోపాల్ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి 3వ వైద్య సదస్సును బీచ్‌రోడ్డులోని గల పార్కు హోటల్లో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. శుక్రవారం ప్రముఖ హోటల్లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు రాష్ట్రం నలుమూలల నుంచి నెఫ్రాలజీ వైద్యులు పెద్ద సంఖ్యలో హాజరవుతారన్నారు. ఈ సదస్సుకు డా.టి.రవిరాజు ఆర్గనైజింగ్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ సమావేశంలో డా.సాయి నరేష్, డి.బి.ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ప్లాస్టిక్ నిర్మూలించి పచ్చదనాన్ని కాపాడాలి**
**నర్సీపట్నం ఏఎస్పీ రిషాంత్‌రెడ్డి**

నర్సీపట్నం : ప్లాస్టిక్ నిర్మూలించి పచ్చధనాన్ని కాపాడాలని నర్సీపట్నం ఏఎస్పీ వై.రిషాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నర్సీపట్నం రిషి కళాశాల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేదిద్దాం.

# జనవరి 8 దేశ వ్యాప్త గ్రామీణ బంద్ విజయవంతం చేయండి

చోడవరం : ప్రభుత్వ రంగాల పరిరక్షణ, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, స్కీమ్ వర్కర్లకు కనీస గౌరవ వేతనం అమలు తదితర వాటిని నెరవేర్చాలని కోరుతూ జనవరి 8న దేశ వ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని పలు ప్రజా సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సి.ఐ.టి.యు కార్యాలయంలో శుక్రవారం పోస్టరును ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, మధ్యాహ్నం భోజన పథకం కార్మిక సంఘం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.చంద్రశేఖర్, డి.వై.ఎఫ్.ఐ, జిల్లా కార్యదర్శి ఎస్.వి.నాయుడు, సి.ఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.గోవింద రావు, తదితరులు పాల్గొన్నారు.




చోడవరంలో బంద్ పోస్టరును ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

# ఓట్లు నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించండి :శివరాజ్ మీనా



యానాం : నియోజకవర్గంలో ఈనెల 16 నుండి 2020 జనవరి 15 వరకు ఆయా పోలింగ్ బూత్ లలో నమోదు చేస్తున్న ఓట్లు నమోదు కార్యక్రమాన్ని బూత్ లెవెల్ అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని ప్రాంతీయ పరిపాలన అధికారి శివరాజ్ మీనా తెలిపారు.

# ఎస్ఎఫ్ఐ స్వర్ణోత్సవాలలో వైజాగ్ స్టూడెంట్ వెస్ట్



విశాఖపట్నం : ఎస్ఎఫ్ఐ స్వర్ణోత్సవాల సందర్భంగా వైజాగ్ స్టూడెంట్ వెస్ట్ నిర్వహించడం జరిగింది. ఉదయం 10 గంటలకు చిత్రలేఖనం పోటీలు మొదలైంది ఇందులో భాగంగా 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా స్టూడెంట్స్ ఎఫైర్స్ డే జి సుధాకర్ విచ్చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకి చర్చా వేదిక కార్యక్రమం మొదలైంది .ఆ విద్యార్థి ఉద్యమం హక్కులు ప్రభుత్వ దాడి అనే అంశం మీద చర్చ జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా కె.సుజాత మరియు ఉపాధ్య క్షులు కె.సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కె.సుజాత మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు విద్యా రంగ పరిరక్షణకై పని చేస్తూనే ఉంది. విద్యారంగంలో సమస్యలపై నిరంతరం మాట్లాడుతూనే ఉంది. మతోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ ఆనాటి నుండి నేటి వరకు మా దేహం ముక్కలైనా, దేశాన్ని ముక్కలు కాని వ్వమని, కులం, మతం పేరుతో వారి ఆటలు సాగనివ్వం. దేశ సమైక్యత కోసం విద్యార్థినీ, విద్యార్థులు ఐక్యం చేస్తూ ముందుకు సాగుతామని తెలియజేశారు.ఇందుకు ప్రస్తుత తరం కూడా తమ వంతు పాత్రను దేశ రక్షణకై ఇవ్వాలి. అలాగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సురేష్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ రిలీజ్ చేయాలి అని ప్రభుత్వాన్ని ముగించారు. సాయంత్రం నాలుగు గంటల నుండి ఇ సాంస్కృతిక కార్యకలాపాలు మొదలయ్యాయి ఇందులో ఎంతో మంది విద్యార్థులు ఉల్లాసంతో ఉత్సాహంతో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి కృషి

**చోడవరంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ**



గోవాడ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

చోడవరం : దీర్ఘకాలికంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఉత్తరాంధ్రా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. ఎమ్మెల్సీగా విజయం సాధించి సుమారు ఏడాది కావస్తున్న సందర్భంగా చోడవరం మండలంలోని పలు గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బదిలీలు, ఆర్.ఎం.ఎస్.ఏ, జీతాలు, సి.పి.ఎస్ రద్దు,తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాన్నారు. ఈ కార్య క్రమంలో ఏపిటిఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణా రావు, చోడవరం ఏపిటిఎఫ్ నాయకులు వంటాకు గోవిందరావు, గొల్లు శ్రీనివాసరావు, మహాలక్ష్మి నాయుడు, గరిమెళ్ళ శ్రీనివాసరావు, సూర్య నారా యణ, ఫణికుమార్, ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 8 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతానికి

# ఏఐటియుసి, సిఐటియు కార్మిక సంఘాల పిలుపు



పెద్దాపురం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జనవరి 8న దేశవ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మెను కార్మికులందరూ విజయవంతం చేయాలని ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఎస్.నారాయణ, సిఐటియు మండల అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు పిలుపునిచ్చారు. స్థానిక వినాయక గుడి వద్ద ఉన్న జట్లు వర్కర్స్ సంఘం కార్యాలయం వద్ద ఏఐటియుసి, సిఐటియు, వివిధ కార్మిక సంఘాల సన్నాహక సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు పి ఎస్ నారాయణ, గడిగట్ల సత్తిబాబు మాట్లాడుతూ ఈనెల 29న మధ్యాహ్నం ఒంటిగంటకు స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సార్వత్రిక సమ్మె విజయవంతంపై సన్నాహక సదస్సు జరుగుతుందని, అనంతరం 3 గంటలకు శ్రీకాకుళం నుండి బయలుదేరిన కార్మిక సంఘాల బస్సుజాతాకు మున్సిపల్ సెంటర్ వద్ద స్వాగతం పలికి ఆంజనేయస్వామి గుడి సెంటర్ కు తోడుకొని వెళ్లడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆంజనేయస్వామి గుడి సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభను కార్మికసంఘాలు, ఏపీ ఎన్జీవోలు, పోస్టల్ , బ్యాంక్, ఆర్టీసీ తదితర ఉద్యోగ సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ఉపాధ్యక్షుడు దారపు రెడ్డి క్రాంతికుమార్, ఏఐటియుసి నాయకులు పెద్దిరెడ్ల సత్యనారాయణ, పెంటకోట సత్తిబాబు, కామిరెడ్డి బోడకొండ, యాకా రామకృష్ణ, పోలిపర్తి తాతారావు, గొంతిన బుల్లిరాజు,గనిశెట్టి శ్రీను, బొట్టా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

# స్కైలెక్స్‌లో భారీ ప్రమాదం

- ఇద్దరు మృతి మరొకరి పరిస్థితి విషమం
- క్షణం...క్షణం...భయం...భయం
- నిన్నవిజయశ్రీ.. నేడుస్కైలెక్స్ ..రేపు మరొకటి
- ఫార్మాలో వరుస ప్రమాదాలు.. భయాంధోళనలో ప్రజలు
- అడకత్తెరలో కంపెనీ యాజమాన్యం
- చోద్యం చూస్తున్న అధికారులు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి బండారు



పరవాడ : మండలములోని జెఎన్ అర్ ఎమ్ పార్మలో గల స్కైలెక్స్ పార్మలో శుక్రవారము విశరసాయన వాయవులు లీక్ అయ్యాయి. ఈలీక్ అయిన విషవాయవులును పీల్చినముగ్గురు కార్మికుల్లో ఇద్దరు మరణచింగా ఒకరు పరిస్దితి విషమంగా ఉంది. వివరాలుకు వెళ్తే అజయ్ కుమార్ ,సత్యనాద్ లు స్కైలెక్స్ పార్మలో విదులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారము తెల్లవారు జామున వీరు పనిచేస్తున్న బ్లాక్ లో విశరసాయన వాయవులు లీక్ అవటముతో అవి పీల్చిన ముగ్గురుకార్మికులు అస్వస్థకు గురు అయ్యారు. వీరిని హుటాహుటానా కేజిహెచ్ కు తరలించగా ఇద్దరు మృతి చెందగా మరొక్కరి పరిస్థితి విషమంగా ఉందిఅని తెలిపారు. ఈసంఘటన స్థలాన్ని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి,మాజీ జిల్లా ప్రాదేశిక సభ్యులు పైలజగన్నాదరావు,మాజీ ఎంపిపి మాదంశెట్టి నీలబాబు, అనకాపల్లి మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ సందర్శించారు.అనంతరము మాజీ మంత్రి బండారు మాట్లడుతూ జవహర్ లాల్ నెహ్రూ ఫార్మాసిటి (జెఎన్ పిసి)లో నిన్న విజయశ్రీ,నేడుస్కైలెక్స్ రేపుమరొక్కటి ఇలా వరుస ప్రమాదాలుతో ప్రజలు అందరూ ప్రణాలు గుప్పిట్లో పెట్టుకొని క్షణం క్షణం భయం భయంగా జీవనము సాగిస్తున్నారనీ తెలిపారు. విజయశ్రీ పార్మలో ప్రమాదం జరిగి ఒకరు మ ృతి చెంది 24గంటలు గడవక ముందే స్కైలెక్స్ పార్మలో బారీప్రమాదం సంబవించి ఇద్దరుచనిపోవడము దురద ృష్టకరమనీ తెలిపారు. ఇలాఅయితే కార్మికులు భద్రత ఎక్కడ ఉందనీ అయన తెలిపారు. భద్రత ప్రమాణాలు పాటించనీ కంపెనీలుపై చర్యలు శూన్యమనీ అయన తెలిపారు.ప్రమాదం జరిగి ఎనిమిదిగంటలు దాటిన కంపెనీ యాజమాన్యం స్పందించలేదుంటే కంపెనీల వెనుక అదికారులు తిలపాపము తలో పిడుకుడుగా వ్యవహరిస్తున్నారనీ పలువురు విమర్శించారు. ప్రమాదంపై సమగ్ర విచారణ చేసి మృతువులుకు తగు న్యాయం చేయాలనీ అయన డిమాండ్ చేసారు. ఈప్రమాదం పై పరవాడ సిఐ రఘవీర్ విష్ణు కేసుమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తాగునీరు, డ్రైనేపూడిక తీత సమస్యలు తక్షణం పరిష్కరించండి



సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

**చోడవరం పట్టణ పర్యటనలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ**

చోడవరం : చోడవరం పట్టణంలో కొళాయి ద్వారా నీటి సరఫరా, డ్రైనేజీలలో పూడిక తీత తదితర సమస్యలను తక్షనం పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పిల్లావారితోట, గునిశెట్టివారి వీధులలో శుక్రవారం ఆకస్మికంగా ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై ప్రజలను ఆరాతీశారు. సాధారణ జీవణానికి ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వై.సి.పి పట్టణ అధ్యక్షులు పుల్లేటి వెంకటరావు,ఓరుగంటి నెహ్రూ, శ్యామల,చిన్నా, పంచాయతీ ఈవో లోవరాజు, స్థానిక వై.సిపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 41వవార్డులో ఏకగ్రీవంగా బూత్ కమిటీ ఎన్నికలు



విశాఖసిటీ : గ్రేటర్ విశాఖ 41వార్డ్ లో బూత్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ కార్యక్రమం లో పెంటకోట త్రినాధ్ పెంటకోట వీరలక్ష్మి, పెంటకోట అజయ్ బాబు కార్తీక్ కుట్ట, నర్సింగరావు నియోజకవర్గ పరిశీలకులు రెడ్డి నారాయణరావు, గోలగాని ఆనంద్ బాబు, బూత్ కన్వీనర్ లు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ

**మినిస్టీరియల్ స్టాఫ్ క్యాలెండరును ఆవిష్కరించిన సీఈఓ నాగార్జునసాగర్**



నర్సీపట్నం : జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని సీఈఓ నాగార్జునసాగర్ హామీ ఇచ్చారని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి సీతారామరాజు (కోటవురట్ల) తెలియజేశారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుల మధ్య లో , డిప్యూటీ సీఈఓ నిర్మలా దేవి సమక్షంలో క్యాలెండర్ ఆవిష్కరణ జరిగిందన్నారు .స్థానిక ఎన్నికల విషయంలో ఉద్యోగులు అందరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. ఉద్యోగులతో సీనియారిటీ ప్రకారం రావాల్సిన ప్రమోషన్లు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన విలేకరులకు తెలియజేశారు.

# క్రీడలలో అనకాపల్లి ఖ్యాతి పెంచిన మాస్టర్



అనకాపల్లి : జిల్లా క్రీడారంగానికి దివంగత దొడ్డి అప్పారావు మాస్టారు ఎంతో వన్నె తెచ్చారు. క్రీడాకారుడిగా వ్యాయామ ఉపాధ్యాయుడిగా క్రీడల నిర్వాహకునిగా ఏమిచేసినా ఆయ శైలి అందరినీ ఆకట్టుకునేది గవరపాలెం దిబ్బవీధి లో జన్మించిన అప్పారావు మాస్టార్ వాలీబాల్ కబాడ్డీ క్రీడాకారుడు జిల్లా రాష్ట్ర స్దాయి పోటీలలో పాల్గొన్నారు. ఆయన ప్రతిభను గుర్తించి వర్తక సంఘం నిర్వహిస్తున్న ఎ.ఎం.ఎ.ఎ హైస్కూలులో వ్యాయామ ఉపాధ్యాయుడుగా నియమించింది. అక్కడి నుండి వాలీబాల్ కబాడీ ఖో ఖో వంటి పోటీలను నిర్వహిస్తూ అందరి మన్ననలు అందుకున్నారు. ప్రతీ ఏటా దిబ్బవీధి కొబ్బరి తోటలో కబాడీ, వాలీ బాల్ పోటీలు నిర్వహించేవారు సుమారు 25 సంవత్సరాల పాటు, వరుసగా ఈ పోటీలను నిర్వహించారు. అనంతరం ఖో ఖో సంఘం జిల్లా కార్యదర్సిగా, అధ్యక్షునిగా రాష్ట్ర చైర్మన్‌గా, రాష్ట్ర అధ్యక్షునిగా కార్యదర్సిగా జాతీయ ఖో ఖో ఫెడరేషన్ కార్యనిర్వాహణ కార్యదర్సిగా వివిధ పదవులు నిర్వహించారు. అనకాపల్లి పట్టణంలోనే కాకుండా జిల్లా నలుమూలలో ఎక్కడ క్రీడలు జరిగిన ఆయన నిర్వాహణలో జరిగాల్సిందే అనకాపల్లిలో సుమారు 20 సార్లు రాష్ట్ర ఖో ఖో పోటీలు నిర్వహించారు. ఒక దపా దక్షిణ భారత ఖో ఖో పోటీలను అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, రాష్ట్ర మంత్రి దాడి వీరభద్రరావు సహకారంతో నిర్వహించారు. అలాగే కేంద్ర మంత్రిగా ఉన్న విఎన్ గాడ్గిల్ దాడి వీరభద్రరావు, అయ్యన్నపాత్రుడు వంటివారి సహకారంతో జాతీయ ఖోఖో పోటీలను అనకాపల్లి మున్సిపల్ స్టేడియంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఎంతో మందిని జిల్లా రాష్ట్ర జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దారు. ఎంతో మందికి విద్యా, ఉద్యోగాలలో స్దానాలు పొందేందుకు సహకరించారు. పట్టణంలో పేద విద్యార్దులకు అనుగుణంగా ప్రశాంతి నికేతను ఎంవివిఎస్ మూర్తి ఇంగ్లీషు మీడియం హైస్కూలున ఏర్పాటు చేసారు. అయితే ఆయన అకాల మరణం క్రీడారంగానికి తీరని లోటును మిగిల్చింది. ఆయన మరణ అనంతరం క్రీడల నిర్వాహణ కుంటుపండింది. ఏది ఏమైనా ఆయనన లేని లోటు క్రీడా రంగానికి వేదన మిగిల్చిందనడంలో సందేహం లేదు. జిల్లా క్రీడా రంగానికి దొడ్డి అప్పారావు మాస్టారు ఖో ఖో మాస్టారుగా చేసిన కృషి విస్మరించలేనిది.

# విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

## మాజీ ఎమ్మెల్యే పీలా



అనకాపల్లి : విద్యా సంవత్సరం ప్రారంభమై 6నెలలు దాటినా ఉపకార వేతనాలు, ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను ఇవ్వకపోవడం వలన విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ రోజు గవరపాలెం లోని ఆయన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.ఫీజు బకాయిలను చెల్లించమని విద్యార్థులు రోడ్ల మీద,రెవెన్యూ కార్యాలయాల వద్ద నిరసనలు చేస్తున్నా, వైస్సార్సీపీ ప్రభుత్వానికి కనిపించకపోవడం దారుణం అని అన్నారు.వైస్సార్సీపీ ప్రభుత్వానికి విద్యార్థులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే బకాయిలను విడుదల చేయాలని కోరారు. జిల్లాలో ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ, ఒకేషనల్ కోర్సులకు చెందిన విద్యార్థుల ఫీజు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడం వలన కాలేజ యాజమాన్యాలు విద్యార్థులకు సరిఫికెట్లు ఇవ్వడం లేదని, ఫలితంగా పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని అన్నారు.జిల్లాలో సుమారు 40కోట్ల మేర విద్యార్థులకు బకాయిలను చెల్లించాల్సి ఉందని అన్నారు. ప్రభుత్వం ఎంతో గొప్పగా చెపుతున్న నాడు-నేడు కార్యక్రమం మాటలలో తప్పా, చేతలలో కనిపించడం లేదని విమర్శించారు.

అనకాపల్లి నియోజకవర్గ పరిధిలోని వసతి గృహాలలోని విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీల బకాయిలు ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సిరసపల్లి సన్యాసిరావు, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోట్ని బాలాజీ,పెంటకోట రాము,కనుమరెడ్డి గోవిందా,బాబూరావు, కర్రీ దేమ్ముళ్ళు,పండూరి కోటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్సీపీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు డా.గౌతమ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన యతిరాజుల నాగేశ్వరరావు**



కంచరపాలెం : వైఎస్సార్సీపీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు డా.గౌతమ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన...

విశాఖ నగర అదనపు అధికార ప్రతినిధి యతి రాజుల నాగేశవరరావు విశాఖ ఉత్తర నియోజకవర్గం సోషల్ మీడియా అధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు

## వ్యాధిగ్రస్తునికి యంపీ ఎంవీవీ ఆర్థిక సాయం



ఎంవిపి కాలనీః పక్షవాత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి విశాఖ యంపీ ఎంవీవీ సత్యనారాయణ శుక్రవారం ఎంవీపీ డబల్ రోడ్ పార్టీ ఆఫీస్‌లో రు. 40 వేలు చెక్కుని అందజేశారు. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌లో భాగంగా మంజూరైన ఈ మొత్తాన్ని, జీవీఎంసీ మూడో వార్డుకి చెందిన కర్రి వరహాలుకు పరిహారంగా అందజేశారు.

ఈ సందర్భంగా యంపీ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ తన పార్లమెంట్ పరిధిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతీ ఒక్కరికీ తాను బాసటగా నిలుస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరహాలు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి, ఎంపీ ఎం.వి.వి సత్యనారాయణకి కృతజ్ఞతలు తెలియజేసారు.

# జగన్ నిర్ణయంతో ఉత్తరాంధ్రకు ఆర్థికబాట

- విశాఖకు పరిపాలనా రాజధానిగా కావలసిన అన్ని హంగులు వున్నాయి
- వ్యతిరేకించిన వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు!
- ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకులు స్వాతి కృష్ణారెడ్డి



విశాఖ సిటీః విశ్వనగరంగా ప్రఖ్యాతిగాంచి, ఏ ఒక్క నగరానికీ తీసిపోని వనరులన్నీ విశాఖకు వున్నాయి. విశాఖను అభివృద్ధి చేస్తే తూర్పున వున్న శ్రీకాకుళం, ఉత్తరాన వున్న విజయనగరంతోపాటు పశ్చిమాన వున్న ఉభయ గోదావరి జిల్లాలు సైతం అభివృద్ధి బాటనుపడతాయని ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకులు స్వాతి (మేడపాటి) కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి ఈ నిర్ణయం శాశ్వత పరిష్కారం చూపనుంది. అనాదిగా వెంటాడుతున్న నిరక్షరాస్యత, నిరుద్యోగం తొలగిపోయి అభివృద్ధి పథంలో దూసుకుపోతాయి. పార్టీలకు, కులమతాలకు, రాగద్వేషాలకు అతీతంగా ఉత్తరాంధ్ర జిల్లాలో ఉంటున్న ప్రతీ ఒక్క వ్యక్తి ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతించాలి. స్వతహాగా వున్న వనరులతో విశాఖ నగరం ఇప్పటికే అనేక దేశీయ, విదేశీయ సంస్థలను ఆకట్టుకుంది. ఈ నిర్ణయం తదనంతరం రెట్టించిన ఉత్సహంతో అనేక సంస్థలు విశాఖలో పెట్టుబడులు పెట్టడానికి వస్తాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఏ ఇతర నగరానికి లేని విధంగా, సువిశాలమైన రహదారులు, రైల్వేజోన్, పూర్తి సమర్థత కలిగిన రెండు పోర్ట్‌లు, అంతర్జాతీయ విమానాశ్రయం, సుమారు 30 కిలోమీటర్ల సువిశాల, సుందరమైన సముద్ర తీరం, ఊటీని తలదన్నేలా అరకు అందాలు, ప్రశాంతతను కాంక్షించే ప్రజానీకం విశాఖకు సొంతం. అమరావతిని రాజధానిగా తాయారు చేయడానికి సుమారుగా లక్ష కోట్లు కావలసి ఉండగా, ఇప్పటికే మన రాష్ట్రం రెండు లక్షల కోట్లు అప్పులలో వున్నది. ఇటువంటి తరుణంలో అన్ని వసతులు వున్న విశాఖను రాజధానిగా చేయటంతో రాష్ట్రంపై ఎటువంటి భారం పడకుండా వుండటమే కాకుండా అతి త్వరగా అభివృద్ధి చెంది రాష్ట్ర ఖజానాకు ఒక ఆర్థిక రాజధానిగా మారుతుంది. ఇటువంటి మహత్తర నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని స్వాతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

## ఏయూను సందర్శించిన టెక్సాస్ వర్సిటీ ఆచార్యుడు

- పరిశోధన భాగస్వామ్యంపై సమాలోచన
- వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో ఆత్మీయ భేటీ



ఆంధ్ర విశ్వకళాపరిషత్ః ఆంధ్ర విశ్వ విద్యాలయాన్ని అమెరికాకు చెందిన టెక్సాస్ ఏ అండ్ ఎం వర్సిటీ ఆచార్యులు ఆనంద్ జె.పుప్పాల సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో ఆత్మీయంగా భేటీ అయ్యారు. రెండు విశ్వవిద్యాలయాల మధ్య సంయుక్త పరిశోధనలు భాగస్వామ్యంపై చర్చించారు.

జియోటెక్నికల్ ఇంజనీరింగ్ రంగంలో ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం జరుపుతున్న పరిశోధనలు ప్రగతిపై చర్చించారు. భవిష్యత్తులో పరిశోధన రంగంలో సంయుక్తంగా పనిచేయాలని వీసీ ఆచార్య ప్రనసాద రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆచార్య అనంద్ జె పుప్పాలను సత్కరించారు.

### ఏయూకు విచ్చేసిన ఐఐటి ఆచార్యులు....

ఐఐటి ముంబాయి ఆచార్యులు బి.వి.ఎస్ విశ్వనాథం ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. వచ్చే సంవత్సరం డిసెంబర్ మాసంలో నిర్వహించే ఇండియన్ జియోటెక్నికల్ కాన్ఫరెన్స్ నిర్వహణపై చర్చించడానికి ఆయన విచ్చేసారు. ప్రతిష్టాత్మకమైన ఈ జాతీయ సదస్సును దాదాపు మూడు దశాబ్ధాల తరువాత ఏయూ ఆతిధ్యం ఇవ్వనుంది. సదస్సు నిర్వహణపై ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో చర్చించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, సివిల్ ఇంజనీరింగ్ విభాగ ఆచార్యులు సి.ఎన్.వి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారికి రాజకీయ గ్రహణం..?

**విజయరామరాజు పేటలో వేడెక్కుతున్న వాతావరణం**

**అడకత్తెరలో అధికారులు**



అనకాపల్లి : అమ్మవారికి రాజకీయ గ్రహణం పట్టుకుందా..విజయరామరాజు పేటలో ఇకపై దుర్గాదేవి పూజలందుకోగలదా.. ఏమో ఏమైందో, ఏమవుతుందో గానీ ప్రస్తుతం పట్టణంలోని విజయరామరాజు పేటలో వాతావరణం మాత్రం వేడెక్కిపోయింది. నానాటికీ సెగ పెరుగుతోంది. వివరాల్లోకి వెళ్తే ఇటీవల కాలంలో ఆ ప్రాంతానికి చెందిన కొందరు భవానీ భక్తులు ఒక షెడ్డు నిర్మించి అందులో దుర్గాదేవిని నెలకొల్పారు. దానికి మునుపు వారు గత 30 సంవత్సరాల నుంచి రహదారిని ఆనుకుని ఉత్సవాలు నిర్వహించేవారట. అయితే ట్రాఫిక్ సమస్య కారణంగా పూజా కార్యక్రమాలు కాస్త దూరంగా తరలించారట. అయితే ఇటీవల భక్తులు అమ్మవారి కోసం ఒక షెడ్డు నిర్మించి అందులో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అక్కడి నుంచి పేటలో వర్గపోరు మొదలైంది. షెడ్డు నిర్మాణానికి పూనుకున్న భక్తులు ఒక వర్గంగా, కాని వారు మరో వర్గంగా ఏర్పడ్డారు. ఒక వర్గం గుడి కావాలంటుంటే మరో వర్గం సామాజిక భవనం అంశాన్ని తెరమీదకు తెచ్చింది.

దీనిపై జీవీఎంసీ, పోలీసు శాఖలకు ఫిర్యాదులు కూడా అందాయి. అయితే ప్రారంభంలో చిన్న తగాదాగా ఉన్న అది నానాటికీ పెద్దదవుతోంది. పైగా రాజకీయ రంగు కూడా పులుముకుంటోంది. గుడి కావాలంటున్న వారు టీడీపీ, వద్దంటున్న వారు వైసీపీకి చెందిన వారనేది భోగట్టా. అనూహ్యంగా ఈ విషయంలో ఎమ్మెల్యే అమర్ నాథ్ పేరు తెరమీదకు వచ్చింది. అక్కడ సామాజిక భవనం నిర్మాణం కోసం ఎమ్మెల్యే నిధుల మంజూరుకు హామీ ఇచ్చారని, వెనువెంటనే ఆ స్థలం ఖాళీ చేయించాలని రెండో వర్గం అధికారుల దగ్గర పట్టుపడుతోందట.

ఇదే సమయంలో గుడి అనేది మిక్కిలి శాతం ప్రజల ఆకాంక్ష, అవసరం గనుక ఆ స్థలాన్ని గుడికే వదిలెయ్యాలని మరో వర్గం అధికారుల దగ్గర మొరపెట్టుకుంటోందట. ఈ నేపథ్యంలో అధికారులు ఎటూ చెప్పలేక అడకత్తెరలో పోక చెక్కలా నలిగిపోతున్నారు. ఈ అంశంలో రాజకీయ కోణం ఉందా లేదా అనే విషయాన్ని పక్కన పెడితే పరిస్థితి మాత్రం ఉద్రిక్తంగా మారే పరిస్థితి నెలకొంది.

అదే జరిగితే అది అధికారులతో పాటు ఎమ్మెల్యే అమర్ కి కూడా తలనొప్పిగా మారే ప్రమాదం ఉంది. ఇకపోతే విజయరామరాజు పేటలో గ్రామ కమిటీ ఉన్నందున అధికారులు మెజార్టీ నిర్ణయం కోసం గ్రామ సభ నిర్వహించే వరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం మంచిదని మద్యస్తంగా ఉన్నవారు సూచిస్తున్నారు. అది కూడా విఫలమైతే ఇరువర్గాలు సంత ృప్తి చెందే రకంగా అధికారిక నిర్ణయం తీసుకుని తమ ప్రాంత ప్రజలందరికీ న్యాయం చేయాలని కోరుతున్నారు.

## యజ్ఞయాగాదుల వల్లే

# గ్రహకూటముల నష్టనివారణ

**భారతదేశంలో అన్ని ప్రాంతాలూ సుభిక్షంగా ఉండాలి**

**విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి**



చినముషిడివాడః గ్రహకూటమి ప్రభావం వల్ల జరిగే నష్టాన్ని నివారించేందుకు, యావత్తు భారతదేశానికి శాంతి చేకూర్చాలన్న సంకల్పంతోనే విశాఖ శ్రీ శారదా పీఠంలో యజ్ఞయాగాదులు చేపట్టడం జరిగిందని పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహా స్వామి వారు అన్నారు.

శుక్రవారం నుంచి ప్రారంభమైన అతిరుద్ర యాగం, లక్షచండీయాగం ప్రారంభానికి ముందు విలేకర్లతో పూజ్య స్వామి వారు మాట్లాడుతూ ఏప్రిల్ వరకు చతుగ్రహకూటమి, షష్ఠగ్రహకూటముల వల్ల పెను ముప్పు వాటిల్లే ప్రమాదం వుండటంతో ఆయా గ్రహాల కూటమి నష్టతీవ్రత, నియంత్రణ యజ్ఞ యాగాదుల ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయిలో భారతదేశం చిత్రపటంలో గుర్తింపు పొందిన విశాఖలోనే శాంతి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భారతదేశంలో అన్ని ప్రాంతాలు సుభిక్షంగా వుండాలన్నది విశాఖ శ్రీ శారదాపీఠం కోరికగా అభివర్ణించారు.

ఇప్పటికే 12 సంవత్సరాలుగా పీఠంలో అనేక యాగాలు నిర్వహించిన రాజ్యసభ సభ్యుడు డా. సుబ్బరామిరెడ్డి ఈ ఏడాది చివరిలో ఈసారి దేశ సౌభాగ్యం కోసం ఈ యజ్ఞయాగాలు చేప్పట్టడం ఎంతో ఆనందంగా వుందని కొనియాడారు.

రాష్ట్రం నలు మూలల నుంచి వచ్చిన 350 మంది ఋత్విక్కులు 5 రోజులపాటు ఈ యజ్ఞంలో పాల్గొని యజ్ఞఫలాలు జాతికి అందించడానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

గోపూజ, గణపతిపూజ, ఋత్విక్ గణన, అగ్నిమధనం, వేదమంత్రోచ్ఛరణలతో ప్రారంభమైనది.

ఈ మహాయజ్ఞంలో రాజ్యసభ సభ్యుడు టి. సుబ్బరామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరక్టర్, పీఠం ఆస్థాన పండితుడు శ్రీ కృష్ణ శర్మ మరియు పలువురు ఆధ్యాత్మికవేత్తలు, మహాస్వామి వారి భక్తులు పాల్గొన్నారు.



చదవండి.. చదివించండి.. విజయభాను











Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ĸ Phone : 2564353, Fax : 0891-2569004 ĸ e-mail: vijayabhanudaily@gmail.com